

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దుచేసినట్టు కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని ముందు జాగ్రత్త చర్యగా రద్దుచేసినట్టు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. కాగా జీవీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేధిక కార్యక్రమాన్ని రద్దుచేస్తున్నట్టు కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. వర్షాల నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకున్నామన్నారు.

మెకానికల్ విభాగంలో మాయాజాలం!

జీవీఎంసీలో నామినేషన్‌పై రూ.15 కోట్ల పనులు కాంట్రాక్టర్లకు అప్పగింత

- గతంలో మాదిరిగానే 34 శాతం లెస్‌కు కట్టబెట్టిన వైనం
- రూ.ఐదు లక్షల లోపు ఉండేలా పనుల విభజన
- బిల్లులు చెల్లించాలని స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదన
- అజెండాలోని 280 అంశాల్లో సగం ఈ విభాగానివే



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో అక్రమాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. ఈనెల నాలుగున జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశం కోసం సిద్ధం చేసిన అజెండాను పరిశీలిస్తే మెకానికల్ విభాగానికి సంబంధించి విస్మయకరమైన విషయాలు వెలుగుచూస్తున్నాయి. కాంట్రాక్టర్లతో కొంతమంది ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కై పనుల పేరుతో అడ్డగోలుగా ప్రజాధనాన్ని పంచిపెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముసుగులో టెండర్లు పిలవకుండానే అస్మదీయులైన కాంట్రాక్టర్లకు పనులను అప్పగించేసిన అధికారులు తాజాగా బిల్లులు చెల్లించేందుకు వీలుగా స్టాండింగ్ కమిటీ ఆమోదానికి ప్రతిపాదించడం చర్చనీయాంశంగా మారింది.

జీవీఎంసీలో స్టాండింగ్ కమిటీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. కౌన్సిల్ ఏర్పడిన తర్వాత ఏడాదికి ఒకసారి చొప్పున మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. తాజాగా ఎన్నికైన కమిటీ తొలి సమావేశం ఈనెల నాలుగో తేదీన నిర్వహించాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్ నిర్ణయించారు. ఇందుకోసం అజెండా తయారుచేయాలని ఆదేశించారు. అధికారులు 280 అంశాలతో ప్రధాన అంజెడాను సిద్ధం చేశారు. మరో 50కిపైగా అంశాలను టేబుల్ అజెండాగా తీసుకువచ్చే అవకాశం కూడా ఉంది. ఇదిలావుండగా స్టాండింగ్ కమిటీ సమావేశం ప్రధాన అజెండా కాపీని బుధవారం సభ్యులకు అందజేశారు. అజెండాను పరిశీలిస్తే మొత్తం 280 అంశాల్లో దాదాపుగా సగానికి పైగా అంశాలు మెకానికల్ విభాగానికి సంబంధించినవే కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆయా అంశాలను నిశితంగా పరిశీలిస్తే మెకానికల్ విభాగంలో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అడ్డగోలుగా పనుల పంపకం

ముడసర్లోవ, టౌన్‌కొత్తరోడ్డు, గాజువాకలో ఉన్న చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నుంచి చెత్తను జీవీఎంసీకి చెందిన క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్(సీసీఎస్) ద్వారా కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకు తరలించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ రాషా ఇన్‌ఫ్రాస్టక్చర్ సంస్థకు సుమారు రూ.ఆరు కోట్లు ఖర్చు చేశారని, ఆ బిల్లులను చెల్లించాలని అధికారులు ప్రతిపాదించారు. సాధారణంగా రూ.ఐదు లక్షలు దాటిన పనులకు టెండర్ పిలవాల్సి ఉంటుంది. కాబట్టి ఆయా పనులను ప్రతీ నాలుగు రోజులకు జోన్‌కు ఒక పని చొప్పున రూ.5 లక్షలు లోపు ఉండేలా విభజించడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. పైగా పనులన్నీ గతంలో చేపట్టిన సంస్థకు కేవలం 0.10 శాతం లెస్‌కు నామినేషన్ పద్ధతిపైనే అప్పగించడం ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తోంది.

అధికశాతం లెస్‌కు పనులు...

అనకాపల్లి జోన్ మినహా మిగిలిన ఏడు జోన్ల పరిధిలో అంతర్గత రోడ్లను మినీ స్వీపింగ్ యంత్రాలతో శుభ్రం చేయడం, పోగైన చెత్తను బకెట్లకు ఎత్తేందుకు మినీ స్కిట్ లోడర్ వాహనాలను జీవీఎంసీ కొనుగోలుచేసింది. వీటికి డ్రైవర్‌ను నియమించుకుని, నిర్వహించే బాధ్యతను కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. మెకానికల్ విభాగంలోని అధికారులు తమకు అస్మదీయులైన కాంట్రాక్టర్లకు వాటి నిర్వహణను నామినేషన్ ప్రాతిపదికన అప్పగించారు. పైగా ఆయా పనులను రెండు సంస్థలే 34 శాతం, 35 శాతం లెస్‌కు కోడ్ చేసినట్టు చూపించారు. 35 శాతం లెస్, జీఎస్‌టీ 18 శాతం, ఈఎండీ ఒకశాతం, టీడీఎస్ రెండుశాతం పోతే మిగిలిన మొత్తానికే కాంట్రాక్టర్లు పనులు ఎలా చేయగలిగారనేది అంతుచిక్కని ప్రశ్న. అంతేకాదు ఆయా పనులను కాంట్రాక్టర్లు సంతృప్తికరంగా పూర్తిచేసినందున వెంటనే బిల్లులు చెల్లించాలంటూ స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదించారు.

వాహనాల అద్దెకు రూ.8.8 లక్షలు

ప్రతి ఎంఎస్ఎఫ్ నుంచి చెత్తను కాపులుప్పాడలోని యార్డుకు తరలించేందుకు జీవీఎంసీకి వాహనాలు ... మిగతా 6వ పేజీలో

సీఐల బదిలీలపై రాజకీయ దుమారం

తమ సిఫారసులు పరిగణనలోకి తీసుకోలేదని కొందరు ఎమ్మెల్యేలు అలక

- గన్‌మన్‌లను వెనక్కి పంపిన ఎమ్మెల్యే పంచకర్ల
- గతంలో మంత్రిగా పనిచేసిన ఎమ్మెల్యేదీ అదే పరిస్థితి
- సీపీ తీరుపై బహిరంగంగానే అసంతృప్తి
- సదరు ఎమ్మెల్యేకి ఫోన్‌చేసి మాట్లాడిన సీపీ!
- కొందరు ప్రజాప్రతినిధులు చెప్పినట్టుగా పోస్టింగ్‌లు
- ఒకవర్గానికే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శలు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగర పోలీస్ కమిషనరేట్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల అంశం రాజకీయవర్గాల్లో దుమారం రేపింది. పోస్టింగ్‌ల్లో తమ సిఫారసులను సీపీ శంఖబ్రతబాగ్చి పరిగణనలోకి తీసుకోలేదని ఎమ్మెల్యేలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇందులో భాగంగానే పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తన ఇద్దరు గన్‌మన్‌లను వెనక్కి పంపేశారని చెబుతున్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన ఓ సీనియర్ ఎమ్మెల్యే కూడా తన పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లకు తాను సూచించిన వారిని కాకుండా ఇతరులను నియమించారని బహిరంగంగానే అంసతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. మరోవైపు సీఐల పోస్టింగ్‌లకు కొంతమంది ప్రజాప్రతినిధులు భారీగా డబ్బులు వసూలుచేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో నేరుగా ఓ ఎమ్మెల్యేకి ఫోన్‌చేసి మాట్లాడినట్టు ప్రచారం జరుగుతోంది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగర పోలీస్‌కమిషనరేట్‌లో సీఐల బదిలీలు చేపట్టలేదు. నగరంలోకి వచ్చేందుకు చాలా మంది ఆశావహులు ప్రయత్నించగా, ప్రస్తుతం పనిచేస్తున్న సీఐలు కొనసాగేందుకు ఆసక్తిచూపారు. ఇందుకోసం వారంతా తమకు పరిచయమున్న ప్రజాప్రతినిధులను ఆశ్రయించారు. ఎమ్మెల్యేలు కూడా తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో విధేయులు, అస్మదీయులను నియమించుకోవాలని భావించారు. ఇందులో భాంగా కొందరి పేర్లను సీపీకి సిఫారసు చేశారు. అయితే నిజాయితీ, సమర్థులుగా గుర్తింపున్న వారిని సీఐలుగా నియమించాలని సీపీ భావించారు. దీంతో బదిలీల అంశం పెండింగ్‌లో ఉండిపోయింది. చివరకు ప్రజాప్రతినిధుల సిఫారసులతోపాటు నగరానికి వచ్చేందుకు ఆసక్తిచూపుతూ సీఐల నుంచి అందిన వినతులను పరిశీలించిన సీపీ 48 మంది సీఐలకు బదిలీ/పోస్టింగ్‌లు కల్పిస్తూ శుక్ర, శనివారాల్లో ఉత్తర్వులు జారీచేశారు. రెండు దఫాలుగా విడుదల చేసిన జాబితాల్లో తాము సూచించినవారికి కాకుండా వేరేవారిని నియమించారంటూ ప్రజాప్రతినిధుల్లో అసంతృప్తి సెగలు వెల్లువెత్తాయి.

సీపీ తమ సిఫారసులు పరిగణలోకి తీసుకోకపోగా, తమ పరిధిలోని స్టేషన్లలో ఎవరిని నియమిస్తున్నారనేది కూడా తెలియజేయలేదని కొందరు ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇక తాము ఎమ్మెల్యేగా ఉండడం ఎందుకంటూ? అనుచరుల వద్ద బహిరంగంగానే సీపీ తీరును తప్పుబట్టినట్టు సమాచారం. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తాను చెప్పిన సీఐని కాకుండా ఎవరో ప్రజాప్రతినిధి చెప్పారంటూ తన పరిధిలోని స్టేషన్‌కు పోస్టింగ్ ఇవ్వడాన్ని నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తనకు కేటాయించిన ఇద్దరు గన్‌మన్‌లను వెనక్కివెళ్లిపోవాలని శుక్రవారం రాత్రి ఆదేశించారు. గతంలో మంత్రిగా పనిచేసిన ఓ ఎమ్మెల్యే కూడా తాను చెప్పిన వ్యక్తికి పోస్టింగ్ ఇవ్వకపోగా, తనకు చెప్పకుండా వేరొకరిని నియమిస్తే తనకు విలువ ఏమిటని అనుచరుల వద్ద అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం. దీనిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానని చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం సీపీ దృష్టికి చేరడంతో నేరుగా ఆయనే ఎమ్మెల్యేకి ఫోన్‌చేసి ఆ స్టేషన్‌లో మరో సీఐని ఎందుకు నియమించాల్సి వచ్చిందనేదానిపై వివరణ ఇచ్చినట్టు పోలీస్‌వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరో సీనియర్ ఎమ్మెల్యే కూడా తన నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్లలో సీఐల పోస్టింగ్‌ల పట్ల అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం.

డబ్బు వసూలుపై ఆరోపణలు...

నగరంలోని సీఐల పోస్టింగ్‌లకు భారీగా డిమాండ్ ఉండడంతో కొంతమంది సీఐలు కొందరు ప్రజాప్రతినిధులకు భారీగా డబ్బులు ముట్టచెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. అనకాపల్లి జిల్లా సరిహద్దులోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ పోస్టింగ్ కోసం ఓ ... మిగతా 6వ పేజీలో

ఎంపాక్స్‌పై అప్రమత్తం!

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు
- ఎయిర్‌పోర్టులో వైద్య బృందం పర్యవేక్షణ
- విదేశీ విమాన ప్రయాణికులపై ప్రత్యేక దృష్టి
- లక్షణాలుంటే గుర్తించి, ఆస్పత్రికి తరలించేలా చర్యలు
- ఛాతి ఆస్పత్రిలో ఐదు పడకలతో ఐసోలేషన్ వార్డు
- కేజీహెచ్‌లో 20 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు
- నాలుగు విభాగాల హెచ్‌వోడీలతో కమిటీ



కేజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డు

విశాఖపట్నం, సెప్టెంబరు 1, (ఆంధ్రజ్యోతి): కరోనా తరువాత ప్రపంచాన్ని భయాందోళనకు గురిచేస్తున్న ఎంపాక్స్ వైరస్‌పై జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. దీనిపై అలెర్ట్‌గా ఉండాలని కేంద్రం హెచ్చరించడంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఆరోగ్యశాఖను అప్రమత్తం చేసింది. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించడంతో అధికారులు ముందుస్తు ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ద్వారా మంకీ ప్యాక్స్ వ్యాప్తి చెందే ప్రమాదమున్న నేపథ్యంలో అధికారులు ఎయిర్‌పోర్టు వద్ద ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమించారు. ఎయిర్‌పోర్టు అథారిటీకి చెందిన మెడికల్ టీమ్‌తోపాటు ఆరోగ్యశాఖకు చెందిన నలుగురు సిబ్బంది విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులను పరీక్షిస్తున్నారు.

మంకీ ఫాక్స్ అధికంగా వ్యాప్తి చెందుతున్న సెంట్రల్ ఆఫ్రికా, ఆఫ్రికా తదితర ప్రాంతాలకు వెళ్లి వస్తున్న ప్రయాణికుల ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. జ్వరం, ఒంటిపై దద్దుర్లు గుర్తిస్తే వెంటనే ఐసోలేట్ చేసేందుకు అనుగుణంగా పెదవాల్తేరులోని ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రిలో ఐదు పడకలతో ఐసోలేషన్ వార్డును ఏర్పాటుచేశారు. అనుమానితుల నుంచి నమూనాలు సేకరించేందుకు వీలుగా కేజీహెచ్‌లోని వైరాలజీ ల్యాబ్ సిబ్బందికి బాధ్యతలను అప్పగించారు. శరీరంపై వచ్చే పొక్కుల నుంచి సీరస్ ఫ్లూయిడ్‌ను సేకరించి పరీక్షల నిమిత్తం పుణేలోని ల్యాబ్‌కు పంపిస్తామని ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించేందుకు ... మిగతా 6వ పేజీలో

భారీ వర్షాలతో పలు రైళ్లు రద్దు



- విజయవాడ సమీపంలో వరద ప్రభావం
- 14 దూర ప్రాంత బస్సు సర్వీసులను రద్దుచేసిన ఆర్టీసీ

విశాఖపట్నం, సెప్టెంబరు 1: భారీ వర్షాల కారణంగా విజయవాడ డివిజన్‌లోని రాయనపాడు రైల్వేస్టేషన్ వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో ఆది వారం వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరాల్సిన ఒరిజినేటింగ్ రైళ్లను రద్దు చేశారు. వీటిలో విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727). విశాఖ-గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (127739), విశాఖ-లోకమాన్య తిలక్ టెర్మిన్ (ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్) (18519), విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20708), విశాఖ-మహబూబనగర్ ఎక్స్‌ప్రెస్ (12861), హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046), సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12704), మహబూబ్‌నగర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (12862), హైదరాబాద్-విశాఖ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728), సికింద్రాబాద్-విశాఖ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12740) ఉన్నాయి. వీటితో పాటు విశాఖ-సికింద్రాబాద్ దురంతో ఎక్స్‌ప్రెస్ (22203), విశాఖ-సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12783), నాందేడు-విశాఖ ఎక్స్‌ప్రెస్ (20812), ... మిగతా 6వ పేజీలో

రైల్వేలో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

భారీ వర్షాల ప్రభావంతో అనేక రైళ్ల రద్దు, మళ్లింపు మార్గంలో నడుస్తున్న నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేస్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటుచేశారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు స్టేషన్లకు చేరాల్సిన వారి సమాచారానికి సంబంధించిన వివరాలను ప్రయాణికుల బంధువులకు తెలిపేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌తోపాటు హెల్ప్ లైన్ ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు. హెల్ప్ లైను ఫోన్ నంబర్లు.... విశాఖ 0891-2746330, 0891-2744619; విజయనగరం 8712641260, 08922-221202; శ్రీకాకుళం రోడ్డు 08942-286213, 08942-286245 సంప్రదించవచ్చునని తెలిపారు.

నేడు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సెలవు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలతో ముందు జాగ్రత్తగా జిల్లాలో సెప్టెంబరు రెండోతేదీ సోమవారం జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ల పరిధిలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సెలవు ప్రకటించామని, ఎట్టి పరిస్థితుల్లో పాఠశాలలు, జూనియర్ కళాశాల స్థాయి విద్యా సంస్థలు తెరవకూడదని స్పష్టంచేశారు. ఈ మేరకు జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

దూరప్రాంత బస్సులు రద్దు

ద్వారకాబస్‌స్టేషన్: విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడం, రహదారులను వరద నీరు ముంచెత్తడం, కొన్ని చోట్ల రోడ్లు, వంతెనలు బలహీన పడడంతో విజయవాడ, ఆపై దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సుల్లో కొన్నింటిని ఆర్టీసీ రద్దుచేసింది. మరి కొన్ని బస్సులను రూట్ మార్చి నడుపుతోంది. ఆదివారం విశాఖ నుంచి నెల్లూరు వెళ్లాల్సిన రెండు సర్వీసులు, గుంటూరు వెళ్లాల్సిన రెండు, తెనాలి వెళ్లాల్సిన రెండు, కనిగిరికి వెళ్లాల్సిన రెండు, హైదరాబాద్ వెళ్లాల్సిన రెండు బస్సులను రద్దుచేసింది. వినుకొండ, నూజివీడు, కర్నూలు, విజయవాడ వెళ్లాల్సిన ఒక్కో సర్వీసును రద్దుచేసింది. విజయవాడ వెళ్లాల్సిన బస్సుల్లో కొన్నింటిని అక్కడి వరద ప్రభావిత ప్రాంతం ముందున్న బస్టాపు వరకు నడుపుతోంది. అత్యవసరంగా విజయవాడ, పరిసర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికుల డిమాండ్ మేరకు ఈ బస్సులు నడుపుతున్నట్టు స్పష్టం చేసింది.

కాగా పాడేరు వెళ్లాల్సిన బస్సులన్నింటినీ రూటు మళ్లించి నడుపుతున్నారు. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో చోడవరం-వడ్డాది మధ్య ఓ బ్రిడ్జి పూర్తిగా బలహీన పడింది. దానిమీదుగా ప్రయాణికులను రవాణా చేయడం సురక్షితం కాదని భావించిన ఆర్టీసీ అధికారులు ఆరు బస్సులను రూటు మళ్లించి నడుపుతున్నారు. భద్రాచలం వెళ్లాల్సిన బస్సులను కూడా రూట్ మార్చిమని తెలిపారు.



విద్యార్థులపై ఫీజులుం!

ముక్కు పిండి వసూలు చేస్తున్న కళాశాలల యాజమాన్యాలు

- డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమా కోర్సులు చేస్తున్న వారిపై ఒత్తిడి
- తరగతులకు, మిడ్, సెమిస్టర్ పరీక్షలకూ అనుమతించమని హుకుం
- అప్పులు చేసి చెల్లిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- ఈ విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో చేరుతున్న వారిదీ అదే పరిస్థితి

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

పెండింగ్ ఫీజులు వెంటనే చెల్లించండి... వారినే తరగతులకు అనుమతిస్తాం.. మిడ్, సెమిస్టర్ పరీక్షలకు కూడా అనుమతించేది లేదు. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు లేవు... ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. మొత్తం ఫీజు చెల్లించాల్సిందే.

- ఇదీ అనకాపల్లిలోని ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు ఇచ్చిన ఆదేశం.



ఒక్క ఈ కళాశాలే కాదు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనేక కళాశాలలు ఫీజుల విషయంలో విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బకాయిలు పేరుకుపోవడం, కూటమి ప్రభుత్వం నుంచి చెల్లింపులపై ఎలాం టి ఆదేశాలు రాకపోవడంతో విద్యార్థుల నుంచి ఫీజు బకాయిలను రాబట్టుకునే పనిలో కళాశాలల యాజమాన్యాలు పడ్డాయి. దీంతో ఇంజనీరింగ్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఇతర వృత్తి విద్యా కోర్సులు చేస్తున్న విద్యార్థులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.



పేరుకుపోయిన బకాయిలు...

వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించినప్పటికీ గత ప్రభుత్వం చెల్లింపులు జరపలేదు. దీంతో బకాయిలు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో వాటన్నింటినీ విద్యార్థులే చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. నేరుగా కాలేజీ యాజమాన్యాలకే ఫీజులు చెల్లిస్తామని కూటమి ప్రభు త్వం ప్రకటించిందని, అయినప్ప టికీ తమను వేధిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థికంగా ఇబ్బందులున్నప్పటికీ యాజమాన్యాలతో వాదనలకు దిగలేక చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ఫీ జులు చెల్లిస్తున్నారు. కళాశాలల యాజమాన్యాల వ్యవహారశైలిపై సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

అన్ని కళాశాలలదీ అదే బాట..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఆ శాఖకు సంబంధించిన అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్ ఫీజులు విడుదల చేస్తామని హామీఇచ్చారు. ఇకపై నేరుగా కళాశాలలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని స్పష్టంచేశారు. అయితే మంత్రి ఆదేశాలను పట్టించుకోని జిల్లాలోని డిగ్రీ, ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యాకోర్సులు నిర్వహించే కళాశాలల యాజమాన్యాలు బకాయిలు చెల్లించాలంటూ విద్యార్థులను తీవ్ర ... మిగతా 6వ పేజీలో

ఎమ్మెల్యేను కలిసిన స్వచ్ఛంద సంస్థ సభ్యులు



ఎమ్మెల్యేని సత్కరిస్తున్న మానవ సేవే.. మాధవ సేవ సభ్యులు

మురళీనగర్, సెప్టెంబరు 1; ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజుని ఆదివారం మాధవధార మానవసేవే మాధవసేవ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.భాను ప్రకాష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం సంస్థ నిర్వహణ, సేవాకార్యక్రమాలను ఎమ్మెల్యేకి వివరించారు. ఈనెల 5తేదీన చేపట్టనున్న వినాయక చవితి మట్టి ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎస్.సతా రామకృష్ణ, ఉపాధ్యక్షులు డి.వరప్రసాద్ సభ్యులు ఉన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



రూపాకుల సుబ్రహ్మణ్యం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 1: ప్రతి విద్యార్థి చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు అన్నారు. ఆదివారం ప్రభుత్వ మహిళా కళాశాలలో స్వాతంత్ర్య సమరయోధులు తామ్రపత్ర గ్రహీత రూపాకుల సుబ్రహ్మణ్యం 102వ జయంతిని గాయత్రి వెల్ఫేర్ కల్చర్ అకాడమి, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.అనంతరం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూపాకుల రవికుమార్, శ్రీలక్ష్మి, అన్నపూర్ణ, రూప పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన డ్రైనేజీ శ్లాబ్

కంచరపాలెం సెప్టెంబరు 1: గ్రేటర్ 48 వార్డు ఇందిరానగర్-5 గ్రామంలో వర్షాలకు కల్వర్ట్ మెయిన్ శ్లాబ్ కూలిపోయింది. పై ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం రావడంతో కల్వర్టు నానిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. మెయిన్ శ్లాబ్ కూలిపోవడంతో సమీపంలో నివాసాల్లోకి మురుగునీరు ప్రవేశించింది. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావ కల్వర్ట్‌ను పరిశీలించి స్థానికులను అప్రమత్తం చేశారు. వర్షం తగ్గిన వెంటనే కల్వర్టు నిర్మాణ పనులు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు. కాలనీ పెద్దలుపాల్గొన్నారు.

ఏఎంసీ విద్యార్థినికి గోల్డ్ మెడల్



పురస్కారం తీసుకుంటున్న విద్యార్థిని

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర మెడికల్ కళాశాల రేడి యాలజీ విభాగం విద్యార్థిని డాక్టర్ పుష్పిత గారపాటి ఉత్తమ పేపర్‌కు గాను డాక్టర్ కాకర్ల సుబ్బారావు స్మా రక గోల్డ్ మె డల్ అందుకు న్నారు. నెల్లూరు జిల్లాలో జ రిగిన ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ రాష్ట్ర పదో వార్షిక సమావేశాల్లో భాగంగా రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు, అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఆమెకు బంగారు పత కాన్ని బహూకరించారు. ఈ సమా వేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కిశోర్‌కుమార్, డాక్టర్ సురేంద్ర, నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా ఎన్ని కైన (ఎలక్ట్) డాల్ఫిన్ డయోగ్నోస్టిక్స్ ఎండీ డాక్టర్ సురేష్, పాల్గొన్నారు.

రౌడీ షీటర్ అరెస్టు

మహారాణిపేట, సెప్టెంబరు 1: పోలీసులపై తిరగబడి దాడికి ప్రయత్నించిన రౌడీ షీటర్‌ను అరెస్టు చేసినట్టు మహారాణిపేట పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి నౌరోజీ రోడ్డు సమీపంలోని ఓ రెస్టారెంట్ సమీపంలో రౌడీషీటర్ సింగంపల్లి సత్యం ఓ ర్యాపిడో వ్యక్తి మీద దాడికి పాల్పడడంతో స్థానికులు సమాచారంపై పోలీసులు చేరుకున్నారు. రౌడీషీటర్‌ను అదుపులోకి తీసుకోవటంతో అతను పోలీసులపై వాగ్వుద్యానికి దిగి తిరగబడ్డాడు. దీని తో పోలీసులు అతనితో పాటు గురునాథ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వార్డుల్లో అధికారులు తనిఖీలు

సీతమ్మధార, సెప్టెంబరు 1: గ్రేటర్ 16, 23వ వార్డుల్లో వీఎంఆర్‌డీఏ సెక్రటరీ డి. కీర్తి, అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్, ఆర్ఐ ఇబ్రహీం, జీవీఎంసీ ఏఎంహెచ్ఓ దుర్గాప్రసాద్ ఆదివారం పర్యటించి పారిశుధ్య పరిస్థితి పరిశీలించారు. సీతమ్మధార రైతుబజార్ పక్కన గల రోడ్డు, కేఆర్ఎం కాలనీ గెడ్డ, హెచ్‌బీ కాలనీ రజక వీధి, క్రిష్ణ కాలేజ్ రోడ్డు, గెడ్డలను పరిశీలించారు. ఆయా ప్రాంతాలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సన్యాసినాయుడులకు సూచించారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేపట్టాలని, చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడాలని, బ్లీచింగ్ చల్లాలని సూచించారు.

ప్రజాసేవే పవన్‌కల్యాణ్ ధ్యేయం

- జన్మదినోత్సవంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ
- 600 మందికి పైగా రక్తదానం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, పార్టీ నాయకులు

సీతంపేట, సెప్టెంబరు 1: ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రజాసేవే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారని ఆ పార్టీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సీతంపేట రాజేంద్రనగర్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ జన్మదినోత్సం పురస్కరించుకుని కార్యకర్తలు, అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదానంలో వందలాది మంది వీర మహిళలు, జనసైనికులు, అభిమానులు బారులు తీరారు. సుమారు 600 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ, పవన్‌కల్యాణ్‌ను ఆదర్శంగా తీసుకొని జనసైనికులు, వీర మహిళలు ప్రజాసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఉపముఖ్య మంత్రిగా పవన్ కల్యాణ్ పాలనలో సంస్కరణలకు కృషి చేస్తున్నారన్నారు. అలాగే ఎన్టీఆర్, రెడ్‌క్రాస్, కేజీహెచ్ బ్లడ్ బ్యాంక్‌ల సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 150 యూనిట్ల రక్తం సేకరించడం గొప్ప విషమమన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులను అభినందించారు. ఈ వేడుకల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

అనాథాశ్రమం పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ

మద్దిపాలెం: మద్దిపాలెం జ్యోతినగర్‌లోని జనరేషన్ యువ అనాథాశ్రయంలో ఆదివారం జనసేన పార్టీ 54వ వార్డు అధ్యక్షుడు వింజుమూరి భాస్కర్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగాఉత్తర నియోజకవర్గ కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం వారికి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. 53, 54 వార్డుల పార్టీ మండల అధ్యక్షుడు నీరుకొండ దివాకర్, స్వర్ణలత, సీతారాము, సురేంద్ర, శివ, అచ్చిమాంబ, జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల రక్తదానం

అక్కయ్యపాలెం: పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ నగర కార్యాలయంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉత్తర నియోజకవర్గం జనసైనికులు నీరుకొండ దివాకర్, బోడసంగి శ్రీధర్, గొంప మోహనరా వు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, పడాల పరమేశ్వరరావు, లక్ష్మి, వింజుమూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న జనసైనికులు



ఆనాథ శ్రమంలో చిన్నారులకు కేక్ తినిపిస్తున్న నాయకులు

సినీ కార్మికుల జీవనోపాధే లక్ష్యం

- ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ అచ్యుతరావు



ప్రమాణస్వీకారం చేస్తున్న అచ్యుతరావు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 1: తెలుగు సినీ పరిశ్రమను విశాఖకు తీసుకొచ్చి 24 క్రాఫ్ట్ కార్మికులకు పూర్తిస్థాయిలో జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ డా.కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆయన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినా ఇంకా తెలుగు పరిశ్రమ తెలంగాణకే పరిమితమైపోయిందన్నారు. ఫలితంగా ఇక్కడకు సినీ పరిశ్రమ ద్వారా వచ్చే ఆదాయం మొత్తం తెలంగాణకు వెళ్లిపోతుందన్నారు. విశాఖలో ఫిల్మ్ ఛాంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సినీ కళాకారులు, కార్మికులకు ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్యాలయం, వెబ్‌సైట్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు తోరంరాజా, ప్రధాన కార్యదర్శి అచ్యుతరామస్వామి పాల్గొన్నారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350 ఆవిష్కరణ



నూతన మోటారు బైక్ ఆవిష్కరిస్తున్న అధినేత సీతారాం

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 1: దొండపర్తి ప్రధాన రహదారిలోని సీతారాం మోటార్స్ షోరూమ్‌లో క్లాసిక్ 350 రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ బైక్‌ను అధినేత సీతారాం ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి యువతకు అందుబాటు ధరలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారు బైకులు లభిస్తాయన్నారు. ముం దుగా షోరూమ్‌లో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ సౌత్ రీజియన్ ఆర్ఎం సోమేష్‌కుమార్, ఏరియా సీనియర్ మేనేజర్ కల్యాణ్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత గండి బాబ్జీ జన్మదినోత్సవం



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మహారాణిపేట, సెప్టెంబరు 1: తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచారు. ముందుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎన్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్, గొలగాని వీరారావు, బత్తి రాజశేఖర్, వానపల్లి గాయత్రి, పణికుమారి, కేదారి లక్ష్మి, వానపల్లి రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఉరుకూటి గణేశ్

సీతమ్మధార: గ్రేటర్ 14వ వార్డు సీతమ్మధారలో శ్రీకృష్ణ మందిరం సమీపంలో విశాఖ పార్లమెంట తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ జన్మదిన వేడుకలను వార్డు అధ్యక్షుడు గొంప ధర్మారావు, పి.వి. వసంతరావు, తెలుగు మహిళా కార్యదర్శి జై హేమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకురాలు పి.శ్రీలక్ష్మి, హరిత, చిన్న, కమలాకర్, నరేంద్ర, అవాల రాము, స్వరూప్, దేవుడు జగ్గారావు, లక్ష్మణశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ కూడలి: గండి బాబ్జీ జన్మదినోత్సవాన్ని జగదాంబ వద్ద ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ 29 వార్డు నాయకుడు ఉరుకూటి గణేశ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు. పేదలకు దుస్తులు అందించారు.

రైళ్లు దారి మళ్లింపు...గమ్యం కుదింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 1: భారీ వర్షాల ప్రభావంతో సోమవారం పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు మరికొన్ని రైళ్లను మళ్లింపు మార్గంలో నడపడం, గమ్యం కుదింపు చర్యలు తీసుకున్నట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. ఈనెల2న (సోమవారం) విశాఖ నుంచి నిజాముద్దీన్ వెళ్లే స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12804) వయా విజయనగరం, రాయగడ, టిట్లాగర్, రాయపూర్, నాగపూర్ మీదుగా, హైదరాబాద్ నుంచి షాలిమార్ వెళ్లే ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (08046) వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడవనున్నాయి. ఆదివారం (1న) వివిధ ఒరిజినేటింగ్ స్టేషన్లలో బయలుదేరిన రైళ్లలో విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), పూరి-ఓఖా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20819) వయా విజయనగరం, రాయగడ, టిట్లాగర్, రాయపూర్, నాగపూర్ మీదుగా; నిజాముద్దీన్-విశాఖ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12804) వయా నాగపూర్, రాయపూర్, టిట్లాగర్, విజయనగరం మీ దుగా; భువనేశ్వర్-ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) వయా గుంటూరు, నల్గొండ, పగిడిపల్లి మీ దుగా నడిచారు. అలాగే, షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045) వయా గుం టూరు, నల్గొండ, పగిడిపల్లి మీదు గా; లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520) వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా; ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019) వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడుస్తున్నాయి.

గుణుపూర్, కిరండోల్ పాసింజర్లకు అదనపు స్లీపర్ క్లాసు కోచ్

నిరీక్షణ జాబితా ప్రయాణికుల సౌకర్యార్థం గుణుపూర్, కిరండోల్ పాసింజర్ రైళ్లకు అదనంగా ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-గుణుపూర్ మధ్య రాకపోకలు సాగిస్తున్న 08522, 08521 పాసింజర్ రైళ్లకు ఈనెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు తాత్కాలికంగా ఒక అదనపు స్లీపర్ క్లాసు కోచ్‌ను జత చేసినట్టు పేర్కొన్నారు.

టికెట్ల రద్దుకు అదనపు కౌంటర్లు ఏర్పాటు

విశాఖపట్నం, సెప్టెంబరు 1: భారీ వర్షాల ప్రభావంతో ఆదివారం అనేక రైళ్ల రద్దుతోపాటు కొన్ని రైళ్ల గమ్యాలను కుదించిన నేపథ్యంలో టికెట్ల రద్దు చేసుకునే ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ రైల్వే స్టేషన్‌లోని సీఆర్ఎస్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రధానంగా విశాఖ నుంచి బయలుదేరే ఒరిజినేటింగ్ రైళ్లు భారీగా రద్దు కావడంతో రైల్వే టికెట్ కేంద్రాల్లో టికెట్లు పొందిన వారు తప్పనిసరిగా ఆయా కేంద్రాల్లోనే రద్దు చేసుకోవాలి. ఈ నేపథ్యంలో టోకెన్ నంబరుతో నిమిత్తం లేకుండా క్యూల్లో నేరుగా టికెట్ రద్దు చేసుకునే అవకాశం కల్పించారు.

డాక్టర్ 'కూటికుప్పల'కు గ్లోబల్ హెల్త్ ఎక్సలెన్సీ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సూర్యారావు

విశాఖపట్నం, సెప్టెంబరు 1: న్యూఢిల్లీలో శనివారం జరిగిన ఏడవ అంతర్జాతీయ హెల్త్ అండ్ వెల్‌నెస్ సదస్సులో పాల్గొన్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు గ్లోబల్ హెల్త్ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. భారత ప్రభుత్వం ఆయుష్, ఆరోగ్యశాఖ, గవర్నమెంట్ఆఫ్ఎన్‌సీటీ, ఎంఎస్ఎంఈ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో కేంద్ర మంత్రి జాదవ్ ప్రతాప్‌రావు గణపాత్రో, కేంద్ర మాజీ మంత్రి అశ్వినీకుమార్ చౌబే చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

యుద్ధాలు ఆపాలని ర్యాలీ



శాంతి సంఘీభావ ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

సిరిపురం, సెప్టెంబరు 1 : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపి, ప్రపంచ శాంతిని నెలకొల్పాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం శాంతి సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ఆ రెండు దేశాల మధ్య యుద్ధాల వల్ల ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరిగి ప్రజలపై నిత్యావసర వస్తువుల భారం పడుతుందన్నారు. ఆయా దేశాల మధ్య యుద్ధాలకు ప్రధాన కారణం అమెరికా అన్నారు. ప్రపంచ శాంతి నెలకొం టేనే ప్రజాస్వామ్యం, కార్మిక వర్గం వర్ధిల్లుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, మణి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ రద్దు చేయాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

సిరిపురం, సెప్టెంబరు 1 : గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపీఎస్‌ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు కోరారు. ఆదివారం వారు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2004 సెప్టెంబరు 1న ప్రవేశ పెట్టిన సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా యూపీఎస్ అంటూ మరో పథకాన్ని సీపీఎస్ ఉద్యోగులకు ప్రతిపాదిస్తూ అమలు చేయాలని చూస్తుందని, సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. రామకృష్ణారావు, గౌరవఅధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు,కార్యదర్శులు ఎన్. విజయశ్రీ, ఎస్. పెద్దినాయుడు, బి. ముత్యాలనాయుడు, నీరజ, జగదీశ్ పాల్గొన్నారు.

మెకానికల్ విభాగంలో మాయాజాలం!

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. వాటితో పాటు కొన్ని అద్దె వాహనాలు సమకూర్చారు. ముడసర్లోవ యార్డులోని చెత్తను కాపులుప్పాడ తరలించేందుకు జీవీఎంసీకి చెందిన రెండు తారస్ లారీలున్నాయి. అయినప్పటికీ మరో రెండు లారీలను అద్దెకు తీసుకున్నామని, వాటికి రూ.8.8 లక్షలు అద్దె చెల్లించాల్సి ఉందని స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటితోపాటు కొన్ని వార్డుల నుంచి ఆరు సీఎంటీ వాహనాలతో చెట్ల వ్యర్థాలను తరలించామని, వాటికి అద్దె చెల్లించాలని స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదించారు. అంతేకాదు జీవీఎంసీ వాహనాలకు మరమ్మతుల పేరిట భారీగా బిల్లులను ప్రతిపాదించడంపైనా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎంపాక్స్‌పై అప్రమత్తం!

... 5వ పేజీ తరువాయి

ఓ నోడల్ అధికారికి బాధ్యతలు అప్పగించామన్నారు.

కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డు

కేజీహెచ్‌లోని క్యాజువాల్టీ మొదటి అంతస్తులో 20 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటుచేశారు. అనుమానిత లక్షణాలతో వచ్చేవారికి ఇక్కడ వైద్య సేవలు అందించేందుకు వీలుగా జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి.రాధాకృష్ణ, మైక్రోబయాలజీ భాగాధిపతి డాక్టర్ పి.రత్నకుమారి, డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.శాంతి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఎ.కృష్ణవేణి ఆధ్వర్యంలో వైద్యుల కమిటీని నియమించారు. రోగులు కోలుకునే వరకు వైద్య సేవలందించేలా వీరికి బాధ్యతలను అప్పగించారు. ఆర్ఎంవో డాక్టర్ భాస్కరరావు పూర్తి ప్రక్రియను పర్యవేక్షించేలా సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ఆదేశాలు జారీ చేశారు.

ఇవీ లక్షణాలు..

మంకీ ఫాక్స్‌ను ఆర్థోపాక్స్ వైరస్‌గా చెబుతున్నారు. దీనిని 1958లోనే గుర్తించారు. తొలుత దీనిని కోతుల్లో గుర్తించడం వల్ల మంకీ ఫాక్స్‌గా పేరు వచ్చింది. 1970లో తొలిసారి మనిషిలో గుర్తించారు. మనుషులతోపాటు ఇతర జీవులకు వ్యాప్తి చెందుతుండడంతో దీన్ని ఎంపాక్స్‌గా పేర్కొంటున్నారు. ఈ వైరస్ సోకిన వ్యక్తి వాడిన దుస్తులు, వస్తువులను వినియోగించడం, వ్యాధి సోకిన జంతువులు కొరికిన ఆహార పదార్థాలను తీసుకోవడం, తాకడం వల్ల ఇతరులకు సోకుతుంది. మనిషి శరీరంలోకి వెళ్లిన తరువాత ఒకటి నుంచి 21 రోజుల్లోగా లక్షణాలు బయపటడే అవకాశముంది. వైరస్ సోకిన వారిలో జ్వరం, ఒళ్లు నొప్పులు, శరీరంపై పొక్కులు, గజ్జులు, చంకల్లో గడ్డలు, ర్యాషెస్ లాంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఈ తరహా లక్షణాలున్న కేసులన్నీ మంకీ పాక్స్ కాకపోవచ్చు. ఈ కేసులు అధికంగా ఉన్న దేశాల నుంచి వచ్చిన వారిలో ఇటువంటి లక్షణాలుంటే అనుమానించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కరోనా మాదిరిగానే దీనికి ప్రత్యేకంగా వైద్యమేదీ లేదు. లక్షణాలకు అనుగుణంగా వైద్య సేవలందించి కోలుకునేలా చేస్తారు.

అప్రమత్తంగా ఉన్నాం

-డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

ప్రభుత్వ ఆదేశాలతో ఎంపాక్స్‌పై అప్రమత్తంగా ఉన్నాం. ఇప్పటికే ఐసోలేషన్ వార్డును సిద్ధం చేశాం. నమూనాలు సేకరించేందుకు ల్యాబ్ సిబ్బందిని నియమించాం. ఇప్పటి వరకు అనుమానిత కేసులు నమోదు కాలేదు. కొన్నాళ్లపాటు ఎయిర్‌పోర్టులో వైద్య సిబ్బంది ఉంటారు. ఎండమిక్ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల సమాచారం ముందుగానే వస్తోంది. వారిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాం. ప్రజలెవరూ భయపడాల్సిన అవసరం లేదు.

సీఐల బదిలీలపై రాజకీయ దుమారం

... 5వ పేజీ తరువాయి

ప్రజాప్రతినిధికి ఒకరు రూ.3 లక్షలు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. నగరశివారు నియోజవర్గం పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో సీఐ పోస్టింగ్‌ల కోసం సదరు ప్రజాప్రతినిధి భార్య స్వయంగా ఇద్దరు సీఐల నుంచి రూ.ఐదు లక్షలు చొప్పున వసూలు చేసినట్టు పోలీస్‌వర్గాల్లో చర్చజరుగుతోంది. నగర నడిబొడ్డున ఉన్న నియోజకవర్గం ఎమ్మెల్యే కూడా సీఐల పోస్టింగ్‌ల కోసం భారీగా వసూళ్లకు పాల్పడినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే తాము సూచించినవారికి పోస్టింగ్ దక్కకపోవడంతో వారంతా తీవ్ర అసహనానికి గురవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భారీ వర్షాలతో పలు రైళ్లు రద్దు

... 5వ పేజీ తరువాయి

మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), హౌరా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12863), హౌరా-పాండిచ్చేరి ఎక్స్‌ప్రెస్ (12867), హౌరా-చెన్నై సెంట్రల్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12839), షాలిమార్-తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్ (22642), హటియా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12835), పూరి-చెన్నై సెంట్ర ల్ ఎక్స్‌ప్రెస్ (22859), పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (17479) లను రద్దుచేశారు.

కాగా విశాఖ నుంచి విజయవాడ బయలుదేరిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను (12717) నూజివీడు స్టేషన్‌లో, విశాఖ నుంచి తిరుపతి/ కడపకు బయలుదేరిన తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను (17488) సామర్లకోట వద్ద నిలిపివేశారు. ఇక విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను (17220) సోమవారం రద్దుచేసినట్టు అధికారులు ప్రకటించారు.

నేడు రద్దు చేసిన రైళ్లు

విశాఖ-సికింద్రాబాద్- విశాఖ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20834), నాందేడు-సంబల్‌పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్ (20810) రద్దు చేశారు. జత రేక్ కొరత కారణంగా ఈనెల 3న (మంగళవారం) లోకమాన్యతిలక్ టెర్మినస్-విశాఖ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520), హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703) రైళ్లను రద్దు చేశారు. సంబల్‌పూర్-నాందేడు నాగావళి ఎక్స్‌ప్రెస్‌ను (20809) విశాఖ రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. విశాఖ-నాందేడు రైలు ను రద్దు చేశారు. హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703), హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22863), షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045), టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189), విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-తిరుపతి/కడప తిరుమల ఎక్స్‌ప్రెస్(17488), విశాఖ-తిరుపతి డబల్ డెక్కర్ (22707), విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), విశాఖ-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (22869), విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలు (08583), విశాఖ-మహబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12861), తిరుపతి-విశాఖ డబల్ డెక్కర్ (22708), భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (12715), ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమార్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12842), షాలిమార్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841), మైసూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ (22818), మహబూబ్‌నగర్-విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12862), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), సంబల్‌పూర్-నాందేడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20809), భువనేశ్వర్-బెంగుళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), భువనేశ్వర్-ముంబయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) రద్దు చేశారు. విశాఖ-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12727), విజయవాడ-విశాఖ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను (12718) ఈనెల 2, 3 తేదీల్లో; గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను (12739) ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు, విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను (12740) ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు, గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌ను (17243) ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు, రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ను (17244) ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు రద్దు చేసినట్టు రైల్వే అధికారులు ప్రకటించారు.

విద్యార్థులపై ఫీజులుం!

... 5వ పేజీ తరువాయి

ఒత్తిడికి గురిచేస్తున్నాయి. గత విద్యా సంవత్సరానికి సంబంధించి పెండింగ్ బకాయిలను విద్యార్థుల నుంచి బలవంతంగా వసూలుచేస్తున్న యాజమాన్యాలు, ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన వారి నుంచీ కూడా ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే చాలామంది విద్యార్థులు ఫీజులు చెల్లించేశారు. అయితే పూర్తి ఫీజు చెల్లిస్తేనే మిడ్, సెమిస్టర్ పరీక్షలకు అనుమతిస్తామని హెచ్చరిస్తుండడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.

నష్టపోయిన విద్యార్థులు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదేళ్లలో విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో జిల్లాలోని వేలాది మంది విద్యార్థులు నష్టపోయారు. 2023-24సంబంధించి విద్యా దీవెన సొమ్మును వైసీపీ ప్రభుత్వం ఒకే ఒక్క విడత విడుదల చేసింది. మిగిలిన మూడువిడతలు పెండింగ్‌లో పెట్టడంతో విద్యార్థులే చెల్లించారు. వసతి దీవెన కింద విద్యార్థులకు ప్రతి ఏటా రూ.20 వేల చొప్పున ఇస్తామని ప్రకటించి, ఒక ఏడాది రూ.10 వేలు మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. అంటే ఒక్కో వి ద్యార్థికి ఏడాదికి పది వేలు చొప్పున నాలుగేళ్లపాటు రూ.40 వేలు బకాయి పెట్టింది. ఈ మొత్తాన్ని వారు పూర్తిగా నష్టపోయారు. గతంలో మాదిరిగా ప్రభుత్వమే నేరుగా కాలేజీలకు ఫీజులు చెల్లించి ఉంటే ఇబ్బందులు తప్పేవని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

మల్కాపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ

మల్కాపురం, సెప్టెంబరు 1: మల్కాపురం స్టేషన్‌కు నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఆదివారం రాత్రి పది గంటల సమయంలో ఆకస్మికంగా వచ్చారు. ఆ సమయంలో స్టేషన్‌లో మహిళా హెడ్ కానిస్టేబుల్ లక్ష్మి ఒకరే విధుల్లో ఉన్నారు. సీపీ స్టేషన్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. స్టేషన్‌కు సంబంధించి పలు వివరాలను హెచ్‌సీని అడిగి తెలుసుకున్నారు. సుమారు గంటపాటు ఆయన స్టేషన్‌లోనే ఉన్నారు. కాగా రాత్రి తొమ్మిది గంటల నుంచి అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బంది రహదారులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇక్కడి సిబ్బంది అంతా సీఐ విద్యాసాగర్ పర్యవేక్షణలో బయట విధుల్లో ఉన్నారు.



'పొలం పిలుస్తోంది' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, సెప్టెంబరు 1: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపడుతుందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఆదివారం చినముషిడివాడలో ఇందుకు సంబంధించిన పోస్టరును వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయాన్ని ఆధునిక, సాంకేతిక పద్ధతుల్లో చేపడితే దిగుబడులు పెరుగుతాయని రైతులకు సూచించారు. కార్పొరేటర్ శేనాపతి వసంత, రెడ్డి నారాయణరావు, గొర్లె రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీలో కంట్రోల్ రూమ్

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో జిల్లా పరిషత్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. 24 గంటలు సిబ్బందికి డ్యూటీలు వేశారు. వర్షాలకు సంబంధించి సహాయక చర్యల కోసం ఫిర్యాదులు చేసేందుకు జడ్పీలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని ఇన్‌చార్జి సీఈవో సత్యనారాయణ తెలిపారు. అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో కూడా సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు.

రెండు మెగా జాబ్ మేళాలు రేపు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల మూడో తేదీన జిల్లాలో రెండుచోట్ల మెగా జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభి వృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయి కృష్ణ చైతన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదగంట్యాడలో ఉన్న నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ వద్ద, జైల్ రోడ్డులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోనూ జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ రెండు మేళాలకు పదో తరగతి, ఐటీ, డిప్లమో, డిగ్రీ అర్హత కలిగిన యువత హాజరుకావచ్చన్నారు. పెదగం ట్యాడలో నేషనల్ అకడమిక్ సెంటర్‌లో ఇన్నోసోర్స్, సెనర్జిస్ కాస్టింగ్ లిమిటెడ్, ఎయిర్టెల్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నామ న్నారు. మరిన్ని వివరాలకు 8121743777 నెంబర్‌కు సంప్రతించా లన్నారు. ప్రభుత్వ మహిళా కాలేజీలో జరిగే మేళాకు సంబంధించి టెక్ విస్సెన్, డబ్ల్యూఎస్‌ఎస్, ఏటీసీ టైర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పాల్గొంటాయన్నారు. దీనికి సంబంధించిన వివరాలకు 99669 65502 నెంబర్‌కు సంప్రతించాలని ఆయన సూచించారు.

రేషన్‌లో అరకిలో పంచదార

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల కోటా కింద బియ్యం కార్డుదారులకు అరకిలో పంచదార అందించారు. అంత్యోదయ కార్డులకు రూ. 13.50 పైసలు, సాధారణ బియ్యం కార్డుదారులకు రూ. 17 వంతున పంచదార పంపిణీ చేయాలని పౌర సరఫరాల సంస్థ నిర్ణయించింది. జిల్లాకు ఇప్పటివరకు 60 టన్నుల పంచదార వచ్చింది. రెండు మూడు రోజుల్లో మిగిలిన స్టాక్ రానుంది. ఆదివారం జిల్లాలో 40 వేల కార్డుదారులకు బియ్యం, 10 వేల కార్డుదారులకు పంచదార పంపిణీ చేశారు.

బధిరుల పాఠశాలకు కుర్చీల వితరణ

పెందుర్తి, సెప్టెంబరు 1: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ జన్మదినం సందర్భంగా పరవాడ మండలం చీపురుపల్లి గ్రామ బాబ్జీ యువ సమూహం ఆధ్వర్యంలో ఆదివారం ఎస్‌ఆర్‌పురంలో గల ప్రియదర్శిని మూగ, చెవిటి బధిరుల ఆశ్రమ పాఠశాలకు కుర్చీలను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బాబ్జీ తనయుడు గండి వంశీ సందీప్ పాల్గొని పాఠశాలకు 50 కుర్చీలను అందించారు. కార్యక్రమంలో పి.జగన్నాథం,వెంకటరమణ. చింతకాయల ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)

● **మారుతీనగర్ సుబ్రమ్మణ్యం :** శ్రీకన్య, మెలోడి, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

● **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● **డిమోంటీ కోలనీ-2 :** శ్రీరామ, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **తంగలాన్ :** శారద, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 46, టమాటా 24, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 20, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 28, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 22, క్యారెట్ 34, దొండకాయలు 28, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 115, మునక్కాడలు (కిలో) 40, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 34, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 270, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 84, పొటల్స్ 36, కీరదోస 32, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 66, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)


(వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519


చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	91
ఫారం ధర	--	111
విత్ స్కిన్	--	192
స్కిన్‌లెస్	--	202



గాజువాక పెంటయ్యనగర్ కొండపై ఉన్న ఇళ్లు



మల్కాపురం ప్రాంతంలో కొండపై ఉన్న నివాసాలు

బిక్కుబిక్కుమంటూ కొండలపై..

వర్షాలతో క్షణ క్షణం..
భయం భయంగా గడుపుతున్న ప్రజలు
ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న ఆందోళన
రిటెయినింగ్ వాల్స్ ఏర్పాటు చేయాలని నివాసితుల వినతి

గాజువాక, సెప్టెంబరు 1: గత కొద్ది రోజులుగా తెరిపివ్వకుండా వర్షాలు కురుస్తుండడంతో కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న వారు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గాజువాక నియోజకవర్గంలో సుమారు ఆరు కొండలపై వేలాది మంది నివసిస్తున్నారు. గతంలో కురిసిన వర్షాలకు సింహగిరి కాలనీ కొండపై మట్టిచరియలు విరిగిపడిన ఘటనలో ఒకరు, పెంటయ్యనగర్ కొండపై నుంచి మట్టిపెళ్లలు జారిపడిన దుర్ఘటనలో ఇద్దరు మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నాలుగు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు కొండ మొత్తం తడిసిముద్దవ్వడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని క్షణ క్షణం.. భయం భయంగా గడుపుతున్నారు. గతంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో కొండ పైనుంచి మట్టి జారిపడకుండా రిటెయినింగ్ వాల్స్ నిర్మించుకోవాలని అధికారులు స్థానికులకు సూచించినా ఎవరూ స్పందించలేదు. ఒక్కొక్క కొండపై సుమారు రెండు వేల వరకు ఇళ్లు ఉన్నాయి. గాజువాకలో బొజ్జన్నకొండ, పెంటయ్య నగర్, గణేశ్ నగర్, బానోజీ కొండ, సింహగిరి కాలనీ, దయాళ్‌నగర్ కొండ, శ్రీనగర్ కొండలున్నాయి. అయితే అధికంగా ప్రమాదాలు పెంటయ్య నగర్, సింహగిరి కాలనీ, బొజ్జన్న కొండ ప్రాంతాల్లో జరిగాయి. ఆయా కొండలపై దాదాపు శిఖరం వరకు ఇళ్లు నిర్మించడంతో ఎటువంటి ప్రమాదాలు సంభవించినా ప్రభుత్వ పరంగా సహాయక చర్యలు అందించడం కష్టతరమే.

మల్కాపురం: తెరిపివ్వకుండా కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఎక్కడ కొండచరియలు విరిగిపడతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఇక్కడి కొండలన్నీ మెత్తని మట్టి స్వభావం కలిగినవి కావడంతో వర్షాలకు మట్టి కరిగి కొండరాళ్లు ఇళ్లను తాకుతాయేమోనని భీతిల్లుతున్నారు. ఇటీవల హనుమాన్ సంజీవ్ కాలనీ, కొత్త నక్కవాని పాలెం కొండల పైనుంచి రాళ్లు దొర్లిరావడంతో మూడిళ్లు దెబ్బతిన్నాయి. గతంలో గణపతి నగర్, హిమాచల్ నగర్, ములగాడ హౌసింగ్ కాలనీ, శాంతి గిరి కాలనీ, జనతా కాలనీ, అల్లూరి సీతారామరాజు కాలనీ, క్రాంతి నగర్, దుర్గా నగర్, త్రినాథపురం, గుడివాడ అప్పన్న కాలనీ, తదితర ప్రాంతాల్లో కొండల పైనుంచి మట్టిచరియలు విరిగిపడడంతో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గణపతి నగర్‌లో కొండ పైనుంచి బండరాయి దొర్లుకొచ్చి ఓ ఇంటిపై పడడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల వల్ల విష సర్పాలు ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని వాపోతున్నారు. కొండలపై రక్షణ గోడలు నిర్మించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

రాబోయే తరాలకు మార్గదర్శి చంద్రబాబు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

తొలిసారి సీఎంగా బాబు బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లయిన సందర్భంగా పార్టీ శ్రేణుల సంబరాలు

గాజువాక, సెప్టెంబరు 1: రాబోయే తరాలకు మార్గదర్శకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. తొలిసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించి 30 ఏళ్లయిన సందర్భంగా ఆదివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో పల్లా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని, ఆయన నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాల ప్రగతి మార్గం వైపు పయనిస్తుందన్నారు. ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సాగే ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా అందరం ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నాయకులు శివప్రసాద్, కొండబాబు, బలగ బాలునాయుడు, శ్రీని వాసరావు, కృష్ణ, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన పల్లా శ్రీనివాసరావు



వడ్లపూడిలో కేక్ కట్ చేస్తున్న బొండా జగన్, తదితరులు

పెదగంట్యాడ: తొలిసారి సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లయిన సందర్భంగా ఇక్కడి టీడీపీ కార్యాలయంలో కార్పొరేటర్ పులిలక్ష్మీబాయి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని ప్రగతి దిశలో నడిపిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ఎస్.అప్పారావు, ఎం.పెంటయ్య, జి.ముత్యాలు, రామునాయుడు, సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: సీఎం చంద్రబాబు పాలన ప్రపంచానికే దిక్సూచి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్‌అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ముందుకు సాగు తుందన్నారు. అనంతరం మంత్రి నారా లోకేశ్ నుంచి ప్రశంసాపత్రాలు పొందిన బి.రాజన్‌రాజు, ఎం.రాము, సీహెచ్ నూకరాజులను ఘనంగా సత్కరించారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలి

ఆటోనగర్, సెప్టెంబరు 1: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు గడసాల అప్పారావు, తిప్పల రమణారెడ్డి అన్నారు. జనసేన 70 వార్డు నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఎల్‌వీ నగర్ సామాజిక భవనంలో జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు ముందుగా కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సేవా తత్పరతకు మారుపేరు పవన్‌కల్యాణ్ అని అన్నారు. రక్తదానం చేసిన జనసైనికులకు అభినందనలు తెలిపారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. సేకరించిన రక్తాన్ని ఎన్టీఆర్ ట్రస్టు బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లంకల మురళీదేవి, కేవీ సూరిబాబు, టి.చిరంజీవి, కె.శ్రీకాంత్, గళ్లా ఈశ్వర్ సాయి, పి.రామలక్ష్మి, బీకే దుర్గ, తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌వీ నగర్‌లో రక్తదానం చేస్తున్న జనసైనికులు



గ్రీన్ సిటీలో రక్తదానం చేస్తున్న మహిళలు

రక్తదానం చాలా గొప్పది

కూర్మన్నపాలెం: అన్ని దానాల కన్నా రక్తదానం చాలా గొప్పదని వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్ కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావు అన్నారు. ఆరోగ్యవంతు లందరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీ క్లబ్ హౌస్‌లో ఆదివారం రోటరీ క్లబ్ బ్లడ్ సెంటర్, వైజాగ్ ప్రొఫైల్స్ టీఎంటీ సింహాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. వివిధ ప్రమాదాల వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారు ఎందరో రక్తం అందక మృత్యువాత పడుతున్నారని, అందువల్ల అందరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు బి.చిన్న సురేశ్ వి.వెంకటరావు, ఎన్.వినయ్, రమేశ్, వెంకటేశ్వరరావు, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే వడ్లపూడి ఎన్టీఆర్ పార్కు ఆవరణలో పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జనసేన పార్టీ వార్డు నాయకులు టీమ్ కేర్ ఆస్పత్రి సౌజన్యంతో రక్త, ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పేదలకు దుస్తులు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి కనకరాజు, తోట ఇందిరా ప్రియదర్శిని, మజ్జి అప్పారావు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురంలో..

మల్కాపురం: పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మల్కాపురంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే గణబాబు, జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ అంగ దుర్గాప్రశాంతి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లా డుతూ ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్ ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి: ఎమ్మెల్యే గణబాబు

సింధియా, సెప్టెంబరు 1: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కూటమి నాయకులు ఆదివారం పశ్చిమ నియోజకవర్గంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా నౌసేనాబాగ్-సింధియా మధ్య రోడ్డు మధ్యనున్న డివైడర్‌పై మొక్కలు నాటారు. ఎమ్మెల్యే గణబాబు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శివశంకర్‌లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో కాలుష్య నివారణకు అధికంగా మొక్కలు నాటి వాటిని చెట్లుగా ఎదిగేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో 33వ వార్డు కార్పొరేటర్ బీశెట్టి వసంతలక్ష్మి, నాయకులు పీలా రామకృష్ణ, ఇంద్రజిత్, ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: మండలంలోని గుర్రమ్మపాలెం పంచాయతీ పరిధి అక్కిరెడ్డిపాలెంలో క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మొక్కలు నాటారు. అనంతరం పంచాయతీ పారిశుధ్య కార్మికులను సత్కరించి నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉగ్గిన గోవింద్,ఎంపీటీసీ గండ్రెడ్డి మాలతి, సుఖవాసి,అజయ్, ఉగ్గిన దేవుడు, చినరమణ, తదితరులు పాల్గొన్నారు. చింతలగ్రహారంలోని గవరపాలెం కాలనీలో జనసేన నియోజకవర్గ నాయకుడు కర్రి శివ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అలాగే చినముషిడివాడలోని శ్రమశక్తినగర్ కాలనీలోని ఘంటశాల ఆడిటోరియంలో కార్పొరేటర్ శేనాపతి వసంత శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పంచకర్ల పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో జెడ్పీ హైమావతి, జనసేన వార్డు అధ్యక్షుడు శేనాపతి సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



డివైడర్‌పై మొక్క నాటుతున్న గణబాబు, తదితరులు

అక్కిరెడ్డిపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించడాన్ని అందరూ కృషి చేయాలని జనసేన పార్టీ నాయకుడు సండ్రాన చిన సన్యాసిరావు అన్నారు. పార్టీ 69 వార్డు ఆధ్వర్యంలో నాతయ్యపాలెంలో క్లీన్ ఆంధ్ర-గ్రీన్ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో చెత్తను తొలగించడంతో పాటు పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.భాస్కర్, ఎ.అప్పారావు, ఎస్.వరహాలరాజు, జి.నరసింహరావు, సాయి ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

తీరంలో చిక్కుకున్న చెన్నై ఫిషింగ్ బోటు

విశాఖపట్నం, సెప్టెంబరు 1: సాంకేతిక సమస్య తలెత్తడంతో చెన్నైకు చెందిన ఫిషింగ్ బోటు విశాఖ సముద్ర తీరంలో చిక్కుకుంది. టీఎన్2ఎంఎం 2210నంబర్ గల మెకనైజ్‌డ్ ఫిషింగ్ బోటు పది మంది మత్స్యకారులతో గత నెల 23న చెన్నై నుంచి వేటకు బయలుదేరింది. ఈ క్రమంలో విశాఖ తీరానికి 52 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ఇంజన్‌లో సాంకేతిక సమస్యనెలకొంది. బోటులోని మత్స్యకారులు తమ యాజమానికి, చెన్నై కోస్టుగార్డు విభాగానికి సమాచారమందించారు. అక్కడి నుంచి విశాఖ కలెక్టర్ కార్యాలయానికి, మెరైన్ కోస్టు గార్డు విభాగానికి సమాచారమందింది. దీంతో అధికారులు వారిని రక్షించి తీరానికి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు.

నేడు ఏయూకు సెలవు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో ఏయూకి సోమవారం సెలవు ప్రకటించినట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. పరీక్షలు, ఇతర ముఖ్యమైన కార్యక్రమాలను వాయిదా వేశామన్నారు.

నూకాంబికకు ప్రత్యేక పూజలు

అగనంపూడి, సెప్టెంబరు 1: జీవీఎంసీ 79వ వార్డు పరిధి పాత అగనంపూడి నూకాంబిక ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించగా పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌జీత్‌కౌర్

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

- విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఎంతటి పోరాటాలకైనా సిద్ధం
- ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 1: ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేయడంతో పాటు కార్మిక హక్కులపై దాడి చేస్తోందని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్ విమర్శించారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం ప్రారంభమైన ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాల్లో మార్పులు చేసి, కార్మిక శక్తిని నాశనం చేస్తోందన్నారు. ఎన్నో పోరాటాలు, 32 మంది ప్రాణత్యాగాల ఫలితంగా ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్‌లకు అప్పగించేందుకు ప్రైవేటీకరణ కుట్రకు తెరతీసిందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎంతటి పోరాటాలకైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సంఘం జాతీయ అధ్యక్షుడు రమేంద్ర మాట్లాడుతూ కార్మికవర్గం బాగుంటేనే దేశం ప్రగతి పథంలో నడుస్తుందని, ప్రస్తుత పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయన్నారు. కేంద్రం కార్పొరేట్‌లకు రుణ మాఫీ చేస్తుందని, కానీ ప్రభుత్వ రంగాన్ని పట్టించుకోదన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అంతకుముందు నేతలు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. మహాసభలకు దేశవ్యాప్తంగా వివిధ సంస్థల నుంచి సుమారు 350 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రనాథ్, ఓబులేసు, నేతలు కేఎస్ఎన్.రావు, జె.రామకృష్ణ, కె.రాజుబాబు, అచ్యుతరావు, ఎం.పైడిరాజు, బీవీ.కొండలరావు పాల్గొన్నారు.

త్వరితగతిన విద్యుత్ పునరుద్ధరణ పనులు

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాల వల్ల దెబ్బతిన్న విద్యుత్ సరఫరా వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, కార్యదర్శి విజయానంద్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నా మన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రులకు, సెల్ టవర్లకు, అత్యవసర సర్వీసులు అందించే ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్టు వెల్లడించారు. అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రిని, సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. వర్షాల వల్ల ఐదు సర్కిళ్ల పరిధిలలోని తొమ్మిది మండలాలు, 60 గ్రామాల్లో 3,299 సర్వీసు కనెక్షన్లకు, 56 వ్యవసాయ సర్వీసు కనెక్షన్లకు విద్యుత్ అంతరాయం ఏర్పడగా యుద్ధప్రాతి పదికన సరిచేసినట్టు చెప్పారు. వినియోగదారులు నుంచి టోల్ ఫ్రీ నెంబర్ 1912కు, కంట్రోల్ రూమ్ నెంబర్లకు వచ్చిన 2,583 ఫిర్యాదులను కాల్ సెంటర్ సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేసుకుని వాటిని క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియజేశారన్నారు. ఒక్క రోజులోనే 2175 ఫిర్యాదులను పరిష్కరించి నట్టు తెలిపారు. వర్షాల ప్రభావంతో తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన స్తంభాలు, పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలకు టోల్‌ఫ్రీ నెంబర్ 1912తో పాటు కంట్రోల్ రూమ్ నెంబర్లు కార్పొరేట్ ఆఫీసు 9440816373, శ్రీకాకుళం 94906 12633, పలాస 7382585630, టెక్కలి 7095875259, విజయనగరం 9490610102, విశాఖపట్నం 73822 99975, రాజమండ్రి 73822 99960, ఏలూరు 94409 02926 లను సంప్రతించాలన్నారు.

గణబాబును కలిసిన ఎల్జీ పాలిమర్స్ బాధితులు

గోపాలపట్నం, సెప్టెంబరు 1: వెంకటాపురం గ్రామంలోని ఎల్జీ పాలిమర్స్ కంపెనీ బాధితులు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబును ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పాలిమర్స్ విష వాయువు ఘటన తరువాత గ్రామంలోని పరిస్థితులు, గత ప్రభుత్వం నెరవేర్చని హామీలను గణబాబుకు వివరించారు. కంపెనీలో కాంట్రాక్టు కార్మికులగా పనిచేసి ఉపాధి కోల్పోయిన వారికి తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ మేరకు గణబాబు మాట్లాడుతూ ఇప్పటికే ఎల్జీ పాలిమర్స్ సమస్యను అసెంబ్లీలో లేవనెత్తిన విషయాన్ని గుర్తు చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా గణబాబు హామీ ఇచ్చారు.

గెడ్డలను ఆధునీకరిస్తాం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో ఎమ్మెల్యే గణబాబు ఆదివారం ఉదయం పర్యటించారు. 58, 60 వార్డుల్లో గెడ్డలను పరిశీలించిన అనంతరం వాటి ఆధునీకరణకు తగిన చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అధికారులకు ఆదేశించారు. రామ్‌నగర్‌లో వర్షానికి కూలిన ఇంటిని , జనతా కాలనీలో రిటెయినింగ్ వాల్ పడిపోయిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. కొండవాలు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు రక్షణ కల్పించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ మాతా శ్రీను, నాయకులు పోతబత్తుల శ్రీను, అంగ దుర్గాప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలపై తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 1: భారీ వర్షాలకు కొండవాలు, నీట మునిగిన ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం విపత్తుల నిర్వహణ ప్రత్యేక అధికారి లక్ష్మారెడ్డి గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

ముఖ్యంగా ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. కొండవాలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడి ప్రజ లను ఖాళీ చేయించాలన్నారు. అంతకు ముందు కొండవాలు ప్రాంతాలైన కంచరపాలెం, కప్పరాడు, రాంజీ ఎస్టేట్ ఏరియాలను సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, డీటీ సువర్ణబాయ్, సర్వేయర్ జగదీశ్వరరావు, వీఆర్వో సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కూడలి వద్ద ఫ్రీ లెఫ్ట్‌ను ఏర్పాటు చేయాలి

అగనంపూడి, సెప్టెంబరు 1: జాతీయ రహదారి అగనంపూడి ఆంజనేయస్వామి ఆలయం కూడలి వద్ద ఫ్రీ లెఫ్ట్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కూడలిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ ఫ్రీ లెఫ్ట్ లేకపోవడం వల్ల తరచూ ప్రమదాలు జరుగుతున్నాయన్నారు. కూడలి ఇరుకుగా ఉండడంతో పాటు ఫ్రీ లెఫ్ట్ లేకపోవడం వల్ల సిగ్నల్స్ పడేంత వరకు వాహనదారులు ఆగాల్సి వస్తుందని, ఈ కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి కూడలిలో నాలుగు వైపులా ఫ్రీ లెఫ్ట్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, బి.చందూ రమేశ్, డి.ప్రకాశ్, రమేశ్, నరసింగరావు, వి.ఈశ్వరరావు, పి.రవిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మెరైన్ ఎస్పీగా రవివర్మ బాధ్యతలు స్వీకరణ

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెరైన్ విభాగం ఎస్పీగా రవివర్మ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. 1989 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన రవివర్మ ఇప్పటివరకూ సీఐడీ విభాగంలో అదనపు ఎస్పీగా పనిచేశారు. ఇటీవల ఆయనకు నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి లభించింది. దీంతో ఆయన్ను మెరైన్ ఎస్పీగా ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ఆయన వీఎంఆర్‌డీఏ కాంప్లెక్స్‌లోని మెరైన్ విభాగం కార్యాలయంలో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

ఎమ్మెల్యేను కలిసిన స్వచ్ఛంద సంస్థ సభ్యులు



ఎమ్మెల్యేని సత్కరిస్తున్న మానవ సేవే.. మాధవ సేవ సభ్యులు

మురళీనగర్, సెప్టెంబరు 1; ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజుని ఆదివారం మాధవధార మానవసేవే మాధవసేవ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.భాను ప్రకాష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం సంస్థ నిర్వహణ, సేవాకార్యక్రమాలను ఎమ్మెల్యేకి వివరించారు. ఈనెల 5తేదీన చేపట్టనున్న వినాయక చవితి మట్టి ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎస్.సతా రామకృష్ణ, ఉపాధ్యక్షులు డి.వరప్రసాద్ సభ్యులు ఉన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



రూపాకుల సుబ్రహ్మణ్యం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 1: ప్రతి విద్యార్థి చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు అన్నారు. ఆదివారం ప్రభుత్వ మహిళా కళాశాలలో స్వాతంత్ర్య సమరయోధులు తామ్రపత్ర గ్రహీత రూపాకుల సుబ్రహ్మణ్యం 102వ జయంతిని గాయత్రి వెల్ఫేర్ కల్చర్ అకాడమి, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.అనంతరం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూపాకుల రవికుమార్, శ్రీలక్ష్మి, అన్నపూర్ణ, రూప పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన డ్రైనేజీ శ్లాబ్

కంచరపాలెం సెప్టెంబరు 1: గ్రేటర్ 48 వార్డు ఇందిరానగర్-5 గ్రామంలో వర్షాలకు కల్వర్ట్ మెయిన్ శ్లాబ్ కూలిపోయింది. పై ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం రావడంతో కల్వర్టు నానిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. మెయిన్ శ్లాబ్ కూలిపోవడంతో సమీపంలో నివాసాల్లోకి మురుగునీరు ప్రవేశించింది. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ గంకల కవిత అప్పారావ కల్వర్ట్‌ను పరిశీలించి స్థానికులను అప్రమత్తం చేశారు. వర్షం తగ్గిన వెంటనే కల్వర్టు నిర్మాణ పనలు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు. కాలనీ పెద్దలుపాల్గొన్నారు.

ఏఎంసీ విద్యార్థినికి గోల్డ్ మెడల్



పురస్కారం తీసుకుంటున్న విద్యార్థిని

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర మెడికల్ కళాశాల రేడి యాలజీ విభాగం విద్యార్థిని డాక్టర్ పుష్పిత గారపాటి ఉత్తమ పేపర్‌కు గాను డాక్టర్ కాకర్ల సుబ్బారావు స్మా రక గోల్డ్ మె డల్ అందుకు న్నారు. నెల్లూరు జిల్లాలో జ రిగిన ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ రాష్ట్ర పదో వార్షిక సమావేశాల్లో భాగంగా రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు, అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఆమెకు బంగారు పత కాన్ని బహూకరించారు. ఈ సమా వేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కిశోర్‌కుమార్, డాక్టర్ సురేంద్ర, నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా ఎన్ని కైన (ఎలక్ట్) డాల్ఫిన్ డయాగ్నోస్టిక్స్ ఎండీ డాక్టర్ సురేష్, పాల్గొన్నారు.

రౌడీ షీటర్ అరెస్టు

మహారాణిపేట, సెప్టెంబరు 1: పోలీసులపై తిరగబడి దాడికి ప్రయత్నించిన రౌడీ షీటర్‌ను అరెస్టు చేసినట్టు మహారాణిపేట పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి నౌరోజీ రోడ్డు సమీపంలోని ఓ రెస్టారెంట్ సమీపంలో రౌడీషీటర్ సింగంపల్లి సత్యం ఓ ర్యాపిడో వ్యక్తి మీద దాడికి పాల్పడడంతో స్థానికులు సమాచారంపై పోలీసులు చేరుకున్నారు. రౌడీషీటర్‌ను అదుపులోకి తీసుకోవటంతో అతను పోలీసులపై వాగ్వివాదానికి దిగి తిరగబడ్డాడు. దీని తో పోలీసులు అతనితో పాటు గురునాథ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వార్డుల్లో అధికారులు తనిఖీలు

సీతమ్మధార, సెప్టెంబరు 1: గ్రేటర్ 16, 23వ వార్డుల్లో వీఎంఆర్‌డీఏ సెక్రటరీ డి. కీర్తి, అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్, ఆర్ఐ ఇబ్రహీం, జీవీఎంసీ ఏఎంహెచ్ఓ దుర్గాప్రసాద్ ఆదివారం పర్యటించి పారిశుధ్య పరిస్థితి పరిశీలించారు. సీతమ్మధార రైతుబజార్ పక్కన గల రోడ్డు, కేఆర్ఎం కాలనీ గెడ్డ, హెచ్‌బీ కాలనీ రజక వీధి, క్రిష్ణ కాలేజ్ రోడ్డు, గెడ్డలను పరిశీలించారు. ఆయా ప్రాంతాలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సన్యాసినాయుడులకు సూచించారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేపట్టాలని, చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడాలని, బ్లీచింగ్ చల్లాలని సూచించారు.

ప్రజాసేవే పవన్‌కల్యాణ్ ధ్యేయం

» జన్మదినోత్సవంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ
» 600 మందికి పైగా రక్తదానం

సీతంపేట, సెప్టెంబరు 1: ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రజాసేవే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారని ఆ పార్టీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సీతంపేట రాజేంద్రనగర్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ జన్మదినోత్సం పురస్కరించుకుని కార్యకర్తలు, అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదానంలో వందలాది మంది వీర మహిళలు, జనసైనికులు, అభిమానులు బారులు తీరారు. సుమారు 600 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ, పవన్‌కల్యాణ్‌ను ఆదర్శంగా తీసుకొని జనసైనికులు, వీర మహిళలు ప్రజాసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఉపముఖ్య మంత్రిగా పవన్ కల్యాణ్ పాలనలో సంస్కరణలకు కృషి చేస్తున్నారన్నారు. అలాగే ఎన్టీఆర్, రెడ్‌క్రాస్, కేజీహెచ్ బ్లడ్ బ్యాంక్‌ల సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 150 యూనిట్ల రక్తం సేకరించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులను అభినందించారు. ఈ వేడుకల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, పార్టీ నాయకులు

అనాథాశ్రమం పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ

మద్రిపాలెం: మద్రిపాలెం జ్యోతినగర్‌లోని జనరేషన్ యువ అనాథాశ్రయంలో ఆదివారం జనసేన పార్టీ 54వ వార్డు అధ్యక్షుడు వింజుమూరి భాస్కర్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగాఉత్తర నియోజకవర్గ కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం వారికి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. 53, 54 వార్డుల పార్టీ మండల అధ్యక్షుడు నీరుకొండ దివాకర్, స్వర్ణలత, సీతారాము, సురేంద్ర, శివ, అచ్చిమాంబ, జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల రక్తదానం

అక్కయ్యపాలెం: పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ నగర కార్యాలయంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉత్తర నియోజకవర్గం జనసైనికులు నీరుకొండ దివాకర్, బోడసంగి శ్రీధర్, గొంప మోహన రా వు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, పడాల పరమేశ్వరరావు, లక్ష్మి, వింజుమూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న జనసైనికులు



ఆనాథ శ్రమంలో చిన్నారులకు కేక్ తినిపిస్తున్న నాయకులు

సినీ కార్మికుల జీవనోపాధే లక్ష్యం

» ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ అచ్యుతరావు



ప్రమాణస్వీకారం చేస్తున్న అచ్యుతరావు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 1: తెలుగు సినీ పరిశ్రమను విశాఖకు తీసుకొచ్చి 24 క్రాఫ్ట్స్ కార్మికులకు పూర్తిస్థాయిలో జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ డా.కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆయన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినా ఇంకా తెలుగు పరిశ్రమ తెలంగాణకే పరిమితమైపోయిందన్నారు. ఫలితంగా ఇక్కడకు సినీ పరిశ్రమ ద్వారా వచ్చే ఆదాయం మొత్తం తెలంగాణకు వెళ్లిపోతుందన్నారు. విశాఖలో ఫిల్మ్ ఛాంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సినీ కళాకారులు, కార్మికులకు ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్యాలయం, వెబ్‌సైట్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు తోరంరాజా, ప్రధాన కార్యదర్శి అచ్యుతరామస్వామి పాల్గొన్నారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350 ఆవిష్కరణ



నూతన మోటారు బైక్ ఆవిష్కరిస్తున్న అధినేత సీతారాం

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 1: దొండపర్తి ప్రధాన రహదారిలోని సీతారాం మోటార్స్ షోరూమ్‌లో క్లాసిక్ 350 రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ బైక్‌ను అధినేత సీతారాం ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి యువతకు అందుబాటు ధరలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారు బైకులు లభిస్తాయన్నారు. ముం దుగా షోరూమ్‌లో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ సౌత్ రీజియన్ ఆర్ఎం సోమేష్‌కుమార్, ఏరియా సీనియర్ మేనేజర్ కల్యాణ్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత గండి బాబ్జీ జన్మదినోత్సవం

మహారాణిపేట, సెప్టెంబరు 1: తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచారు. ముందుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్, గొలగాని వీరారావు, బత్తి రాజశేఖర్, వానపల్లి గాయత్రి, పణికుమారి, కేదారి లక్ష్మి, వానపల్లి రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఉరుకూటి గణేశ్

సీతమ్మధార: గ్రేటర్ 14వ వార్డు సీతమ్మధారలో శ్రీకృష్ణ మందిరం సమీపంలో విశాఖ పార్లమెంట తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ జన్మదిన వేడుకలను వార్డు అధ్యక్షుడు గొంప ధర్మారావు, పి.వి. వసంతరావు, తెలుగు మహిళా కార్యదర్శి జై హేమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకురాలు పి.శ్రీలక్ష్మి, హరిత, చిన్న, కమలాకర్, నరేంద్ర, అవాల రాము, స్వరూప్, దేవుడు జగ్గారావు, లక్ష్మణశెట్టి, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

జగదాంబ కూడలి: గండి బాబ్జీ జన్మదినోత్సవాన్ని జగదాంబ వద్ద ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ 29 వార్డు నాయకుడు ఉరుకూటి గణేశ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు. పేదలకు దుస్తులు అందించారు.

రైళ్లు దారి మళ్లింపు...గమ్యం కుదింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 1: భారీ వర్షాల ప్రభావంతో సోమవారం పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు మరికొన్ని రైళ్లను మళ్లింపు మార్గంలో నడపడం, గమ్యం కుదింపు చర్యలు తీసుకున్నట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. ఈనెల2న (సోమవారం) విశాఖ నుంచి నిజాముద్దీన్ వెళ్లే స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12804) వయా విజయనగరం, రాయగడ, టిట్లాగర్, రాయపూర్, నాగపూర్ మీదుగా, హైదరాబాద్ నుంచి షాలిమార్ వెళ్లే ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (08046) వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడవనున్నాయి. ఆదివారం (1న) వివిధ ఒరిజినేటింగ్ స్టేషన్లలో బయలుదేరిన రైళ్లలో విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), పూరి-చోఖా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20819) వయా విజయనగరం, రాయగడ, టిట్లాగర్, రాయపూర్, నాగపూర్ మీదుగా; నిజాముద్దీన్-విశాఖ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12804) వయా నాగపూర్, రాయపూర్, టిట్లాగర్, విజయనగరం మీ దుగా; భువనేశ్వర్-ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) వయా గుంటూరు, నల్గొండ, పగిడిపల్లి మీ దుగా నడిచారు. అలాగే, షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045) వయా గుం టూరు, నల్గొండ, పగిడిపల్లి మీదు గా; లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520) వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా; ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019) వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడుస్తున్నాయి.

గుణుపూర్, కిరండోల్ పాసింజర్లకు అదనపు స్లీపర్ క్లాసు కోచ్

నిరీక్షణ జాబితా ప్రయాణికుల సౌకర్యార్థం గుణుపూర్, కిరండోల్ పాసింజర్ రైళ్లకు అదనంగా ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-గుణుపూర్ మధ్య రాకపోకలు సాగిస్తున్న 08522, 08521 పాసింజర్ రైళ్లకు ఈనెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు తాత్కాలికంగా ఒక అదనపు స్లీపర్ క్లాసు కోచ్‌ను జత చేసినట్టు పేర్కొన్నారు.

టికెట్ల రద్దుకు అదనపు కౌంటర్లు ఏర్పాటు

విశాఖపట్నం, సెప్టెంబరు 1: భారీ వర్షాల ప్రభావంతో ఆదివారం అనేక రైళ్ల రద్దుతోపాటు కొన్ని రైళ్ల గమ్యాలను కుదించిన నేపథ్యంలో టికెట్ల రద్దు చేసుకునే ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ రైల్వే స్టేషన్‌లోని సీఆర్ఎస్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రధానంగా విశాఖ నుంచి బయలుదేరే ఒరిజినేటింగ్ రైళ్లు భారీగా రద్దు కావడంతో రైల్వే టికెట్ కేంద్రాల్లో టికెట్లు పొందిన వారు తప్పనిసరిగా ఆయా కేంద్రాల్లోనే రద్దు చేసుకోవాలి. ఈ నేపథ్యంలో టోకెన్ నంబరుతో నిమిత్తం లేకుండా క్యూల్లో నేరుగా టికెట్ రద్దు చేసుకునే అవకాశం కల్పించారు.

డాక్టర్ 'కూటికుప్పల'కు గ్లోబల్ హెల్త్ ఎక్సలెన్సీ అవార్డు

విశాఖపట్నం, సెప్టెంబరు 1: న్యూఢిల్లీలో శనివారం జరిగిన ఏడవ అంతర్జాతీయ హెల్త్ అండ్ వెల్‌నెస్ సదస్సులో పాల్గొన్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు గ్లోబల్ హెల్త్ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. భారత ప్రభుత్వం ఆయుష్, ఆరోగ్యశాఖ, గవర్నమెంట్‌ఆఫ్ఎన్‌సీటీ, ఎంఎస్ఎంఈ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో కేంద్ర మంత్రి జాదవ్ ప్రతాప్‌రావు గణపాత్రో, కేంద్ర మాజీ మంత్రి అశ్వినీకుమార్ చౌబే చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సూర్యారావు

యుద్ధాలు ఆపాలని ర్యాలీ



శాంతి సంఘీభావ ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

సిరిపురం, సెప్టెంబరు 1 : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపి, ప్రపంచ శాంతిని నెలకొల్పాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం శాంతి సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ఆ రెండు దేశాల మధ్య యుద్ధాల వల్ల ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరిగి ప్రజలపై నిత్యావసర వస్తువుల భారం పడుతుందన్నారు. ఆయా దేశాల మధ్య యుద్ధాలకు ప్రధాన కారణం అమెరికా అన్నారు. ప్రపంచ శాంతి నెలకొం టేనే ప్రజాస్వామ్యం, కార్మిక వర్గం వర్ధిల్లుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్‌కే ఎస్‌వీ కుమార్, మణి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ రద్దు చేయాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

సిరిపురం, సెప్టెంబరు 1 : గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపీఎస్‌ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు కోరారు. ఆదివారం వారు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2004 సెప్టెంబరు 1న ప్రవేశపెట్టిన సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా యూపీఎస్ అంటూ మరో పథకాన్ని సీపీఎస్ ఉద్యోగులకు ప్రతిపాదిస్తూ అమలు చేయాలని చూస్తుందని, సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. రామకృష్ణారావు, గౌరవఅధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు,కార్యదర్శులు ఎన్. విజయశ్రీ, ఎస్. పెద్దినాయుడు, బి. ముత్యాలనాయుడు, నీరజ, జగదీశ్ పాల్గొన్నారు.

మెకానికల్ విభాగంలో మాయాజాలం!

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. వాటితో పాటు కొన్ని అద్దె వాహనాలు సమకూర్చారు. ముడసర్లోవ యార్డులోని చెత్తను కాపులుప్పాడ తరలించేందుకు జీవీఎంసీకి చెందిన రెండు తారస్ లారీలున్నాయి. అయినప్పటికీ మరో రెండు లారీలను అద్దెకు తీసుకున్నామని, వాటికి రూ.8.8 లక్షలు అద్దె చెల్లించాల్సి ఉందని స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదించడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటితోపాటు కొన్ని వార్డుల నుంచి ఆరు సీఎంటీ వాహనాలతో చెట్ల వ్యర్థాలను తరలించామని, వాటికి అద్దె చెల్లించాలని స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదించారు. అంతేకాదు జీవీఎంసీ వాహనాలకు మరమ్మతుల పేరిట భారీగా బిల్లులను ప్రతిపాదించడంపైనా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎంపాక్స్‌పై అప్రమత్తం!

... 5వ పేజీ తరువాయి

ఓ నోడల్ అధికారికి బాధ్యతలు అప్పగించామన్నారు.

కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డు

కేజీహెచ్‌లోని క్యాజువాల్టీ మొదటి అంతస్తులో 20 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటుచేశారు. అనుమానిత లక్షణాలతో వచ్చేవారికి ఇక్కడ వైద్య సేవలు అందించేందుకు వీలుగా జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి.రాధాకృష్ణ, మైక్రోబయాలజీ భాగాధిపతి డాక్టర్ పి.రత్నకుమారి, డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.శాంతి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఎ.కృష్ణవేణి ఆధ్వర్యంలో వైద్యుల కమిటీని నియమించారు. రోగులు కోలుకునే వరకు వైద్య సేవలందించేలా వీరికి బాధ్యతలను అప్పగించారు. ఆర్ఎంవో డాక్టర్ భాస్కరరావు పూర్తి ప్రక్రియను పర్యవేక్షించేలా సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ఆదేశాలు జారీ చేశారు.

ఇవీ లక్షణాలు..

మంకీ ఫాక్స్‌ను ఆర్థోపాక్స్ వైరస్‌గా చెబుతున్నారు. దీనిని 1958లోనే గుర్తించారు. తొలుత దీనిని కోతుల్లో గుర్తించడం వల్ల మంకీ ఫాక్స్‌గా పేరు వచ్చింది. 1970లో తొలిసారి మనిషిలో గుర్తించారు. మనుషులతోపాటు ఇతర జీవులకు వ్యాప్తి చెందుతుండడంతో దీన్ని ఎంఫాక్స్‌గా పేర్కొంటున్నారు. ఈ వైరస్ సోకిన వ్యక్తి వాడిన దుస్తులు, వస్తువులను వినియోగించడం, వ్యాధి సోకిన జంతువులు కొరికిన ఆహార పదార్థాలను తీసుకోవడం, తాకడం వల్ల ఇతరులకు సోకుతుంది. మనిషి శరీరంలోకి వెళ్లిన తరువాత ఒకటి నుంచి 21 రోజుల్లోగా లక్షణాలు బయపటడే అవకాశముంది. వైరస్ సోకిన వారిలో జ్వరం, ఒళ్లు నొప్పులు, శరీరంపై పొక్కులు, గజ్జులు, చంకల్లో గడ్డలు, ర్యాషెస్ లాంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఈ తరహా లక్షణాలున్న కేసులన్నీ మంకీ పాక్స్ కాకపోవచ్చు. ఈ కేసులు అధికంగా ఉన్న దేశాల నుంచి వచ్చిన వారిలో ఇటువంటి లక్షణాలుంటే అనుమానించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కరోనా మాదిరిగానే దీనికి ప్రత్యేకంగా వైద్యమేదీ లేదు. లక్షణాలకు అనుగుణంగా వైద్య సేవలందించి కోలుకునేలా చేస్తారు.

అప్రమత్తంగా ఉన్నాం

-డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

ప్రభుత్వ ఆదేశాలతో ఎంపాక్స్‌పై అప్రమత్తంగా ఉన్నాం. ఇప్పటికే ఐసోలేషన్ వార్డును సిద్ధం చేశాం. నమూనాలు సేకరించేందుకు ల్యాబ్ సిబ్బందిని నియమించాం. ఇప్పటి వరకు అనుమానిత కేసులు నమోదు కాలేదు. కొన్నాళ్లపాటు ఎయిర్‌పోర్టులో వైద్య సిబ్బంది ఉంటారు. ఎండమిక్ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల సమాచారం ముందుగానే వస్తోంది. వారిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాం. ప్రజలెవరూ భయపడాల్సిన అవసరం లేదు.

సీఐల బదిలీలపై రాజకీయ దుమారం

... 5వ పేజీ తరువాయి

ప్రజాప్రతినిధికి ఒకరు రూ.3 లక్షలు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. నగరశివారు నియోజవర్గం పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో సీఐ పోస్టింగ్‌ల కోసం సదరు ప్రజాప్రతినిధి భార్య స్వయంగా ఇద్దరు సీఐల నుంచి రూ.ఐదు లక్షలు చొప్పున వసూలు చేసినట్టు పోలీస్‌వర్గాల్లో చర్చజరుగుతోంది. నగర నడిబొడ్డున ఉన్న నియోజకవర్గం ఎమ్మెల్యే కూడా సీఐల పోస్టింగ్‌ల కోసం భారీగా వసూళ్లకు పాల్పడినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే తాము సూచించినవారికి పోస్టింగ్ దక్కకపోవడంతో వారంతా తీవ్ర అసహనానికి గురవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భారీ వర్షాలతో పలు రైళ్లు రద్దు

... 5వ పేజీ తరువాయి

మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), హౌరా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12863), హౌరా-పాండిచ్చేరి ఎక్స్‌ప్రెస్ (12867), హౌరా-చెన్నై సెంట్రల్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12839), షాలిమార్-తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్ (22642), హటియా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12835), పూరి-చెన్నై సెంట్ర ల్ ఎక్స్‌ప్రెస్ (22859), పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (17479) లను రద్దుచేశారు.

కాగా విశాఖ నుంచి విజయవాడ బయలుదేరిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను (12717) నూజివీడు స్టేషన్‌లో, విశాఖ నుంచి తిరుపతి/ కడపకు బయలుదేరిన తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను (17488) సామర్లకోట వద్ద నిలిపివేశారు. ఇక విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను (17220) సోమవారం రద్దుచేసినట్టు అధికారులు ప్రకటించారు.

నేడు రద్దు చేసిన రైళ్లు

విశాఖ-సికింద్రాబాద్- విశాఖ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20834), నాందేడు-సంబల్‌పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్ (20810) రద్దు చేశారు. జత రేక్ కొరత కారణంగా ఈనెల 3న (మంగళవారం) లోకమాన్యతిలక్ టెర్మినస్-విశాఖ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520), హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ (12703) రైళ్లను రద్దు చేశారు. సంబల్‌పూర్-నాందేడు నాగావళి ఎక్స్‌ప్రెస్‌ను (20809) విశాఖ రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. విశాఖ-నాందేడు రైలు ను రద్దు చేశారు. హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703), హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22863), షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045), టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189), విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-తిరుపతి/కడప తిరుమల ఎక్స్‌ప్రెస్(17488), విశాఖ-తిరుపతి డబల్ డెక్కర్ (22707), విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), విశాఖ-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (22869), విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలు (08583), విశాఖ-మహబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12861), తిరుపతి-విశాఖ డబల్ డెక్కర్ (22708), భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (12715), ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమార్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12842), షాలిమార్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841), మైసూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ (22818), మహబూబ్‌నగర్-విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12862), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), సంబల్‌పూర్-నాందేడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20809), భువనేశ్వర్-బెంగుళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), భువనేశ్వర్-ముంబయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) రద్దు చేశారు. విశాఖ-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12727), విజయవాడ-విశాఖ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను (12718) ఈనెల 2, 3 తేదీల్లో; గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను (12739) ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు, విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను (12740) ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు, గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌ను (17243) ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు, రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ను (17244) ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు రద్దు చేసినట్టు రైల్వే అధికారులు ప్రకటించారు.

విద్యార్థులపై ఫీజులుం!

... 5వ పేజీ తరువాయి

ఒత్తిడికి గురిచేస్తున్నాయి. గత విద్యా సంవత్సరానికి సంబంధించి పెండింగ్ బకాయిలను విద్యార్థుల నుంచి బలవంతంగా వసూలుచేస్తున్న యాజమాన్యాలు, ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన వారి నుంచీ కూడా ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే చాలామంది విద్యార్థులు ఫీజులు చెల్లించేశారు. అయితే పూర్తి ఫీజు చెల్లిస్తేనే మిడ్, సెమిస్టర్ పరీక్షలకు అనుమతిస్తామని హెచ్చరిస్తుండడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.

నష్టపోయిన విద్యార్థులు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదేళ్లలో విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో జిల్లాలోని వేలాది మంది విద్యార్థులు నష్టపోయారు. 2023-24సంబంధించి విద్యా దీవెన సొమ్మును వైసీపీ ప్రభుత్వం ఒకే ఒక్క విడత విడుదల చేసింది. మిగిలిన మూడువిడతలు పెండింగ్‌లో పెట్టడంతో విద్యార్థులే చెల్లించారు. వసతి దీవెన కింద విద్యార్థులకు ప్రతి ఏటా రూ.20 వేల చొప్పున ఇస్తామని ప్రకటించి, ఒక ఏడాది రూ.10 వేలు మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. అంటే ఒక్కో వి ద్యార్థికి ఏడాదికి పది వేలు చొప్పున నాలుగేళ్లపాటు రూ.40 వేలు బకాయి పెట్టింది. ఈ మొత్తాన్ని వారు పూర్తిగా నష్టపోయారు. గతంలో మాదిరిగా ప్రభుత్వమే నేరుగా కాలేజీలకు ఫీజులు చెల్లించి ఉంటే ఇబ్బందులు తప్పేవని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

మల్కాపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ

మల్కాపురం, సెప్టెంబరు 1: మల్కాపురం స్టేషన్‌కు నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఆదివారం రాత్రి పది గంటల సమయంలో ఆకస్మికంగా వచ్చారు. ఆ సమయంలో స్టేషన్‌లో మహిళా హెడ్ కానిస్టేబుల్ లక్ష్మి ఒకరే విధుల్లో ఉన్నారు. సీపీ స్టేషన్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. స్టేషన్‌కు సంబంధించి పలు వివరాలను హెచ్‌సీని అడిగి తెలుసుకున్నారు. సుమారు గంటపాటు ఆయన స్టేషన్‌లోనే ఉన్నారు. కాగా రాత్రి తొమ్మిది గంటల నుంచి అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బంది రహదారులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇక్కడి సిబ్బంది అంతా సీఐ విద్యాసాగర్ పర్యవేక్షణలో బయట విధుల్లో ఉన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, సెప్టెంబరు 1 : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి, బేడామండప ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి స్వర్ణ పుష్పంతో పూజ జరిపారు. తరువాత అదే వేదికపై స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, సెప్టెంబరు 1 : వరాహలక్ష్మీనృసింహ స్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి హైదరాబాద్‌లోని బేగంపేటకు చెందిన విశ్వేశ్వరరావు, సృజన దంపతులు రూ. లక్ష విరాళంగా సమర్పించారు.విరాళాన్ని నగదు రూపంలో ప్రజా సంబంధాల అధికారి సిరిపురపు కనకరాజుకు ఆదివారం అందజేశారు.ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నేడు రక్తదాన శిబిరం

భీమునిపట్నం, సెప్టెంబరు 1 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినోత్సవం పురస్కరించుకుని సోమవారం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎం.ఫణికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ విక్టోరియా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది దాతల నుంచి రక్తం సేకరిస్తారన్నారు.

సభ్యత్వాల నమోదుపై అవగాహన

భీమునిపట్నం, సెప్టెంబరు 1 : బీజేపీ సభ్యత్వాల నమోదును నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఉత్తరాంధ్ర సభ్యత్వాల నమోదు ప్రముఖ్ కేతినేని సురేంద్రమోహన్ కోరారు. ఆదివారం చిన్న బజారులో ఉన్న ఫంక్షన్ హాల్‌లో సభ్యత్వాల నమోదుపై కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

తీరంలో చిక్కుకున్న చెన్నై ఫిషింగ్ బోటు

మహారాణిపేట, సెప్టెంబరు 1 : సాంకేతిక సమస్య తలెత్తడంతో చెన్నైకు చెందిన ఫిషింగ్ బోటు తీరంలో చిక్కుకుంది. టీఎన్2ఎమ్ఎమ్ 2210 నంబర్ గల మెకానైజ్‌డ్ ఫిషింగ్ బోటు పది మంది మత్స్యకారులతో గతనెల 23న చెన్నై నుంచి వేటకు బయలుదేరింది. ఈ క్రమంలో విశాఖ తీరానికి 52 నాటికల్ మైళ్ల దూరంలో ఇంజన్‌లో సాంకేతిక సమస్య నెలకొంది. దీంతో బోటులోని మత్స్యకారులు తమ యాజమానికి, చెన్నై కోస్టుగార్డు విభాగానికి సమాచారం మందించారు. అక్కడి నుంచి విశాఖ కలెక్టర్ కార్యాలయానికి, మెరైన్ కోస్టుగార్డు విభాగానికి సమాచారం రావడంతో అధికారులు వారిని రక్షించి తీరానికి చేర్చారు.

జడ్పీలో కంట్రోల్ రూమ్

విశాఖపట్నం,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాల నేపథ్యంలో జిల్లా పరిషత్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 24 గంటలు సిబ్బందికి డ్యూటీలు వేశారు. వర్షాలకు సంబంధించి సహాయక చర్యల కోసం ఫిర్యాదులు చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని ఇన్‌చార్జి సీఈవో సత్యనారాయణ తెలిపారు.

మెరైన్ ఎస్పీగా రవివర్మ

విశాఖపట్నం,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మెరైన్ విభాగం ఎస్పీగా రవివర్మ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. 1989 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన రవివర్మ ఇప్పటివరకూ సీఐడీ విభాగంలో అదనపు ఎస్పీగా పనిచేశారు. ఇటీవల ఆయనకు నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి లభించింది. దీంతో ఆయన్ను మెరైన్ ఎస్పీగా ప్రభుత్వం నియమించింది.

నేడు ఏయూకు సెలవు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాల నేపథ్యంలో ఏయూకి సోమవారం సెలవు ప్రకటించినట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షలు, ఇతర కార్యక్రమాలను వాయిదా వేశామన్నారు.

సినిమా గైడ్

- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** శ్రీకన్య, మెలోడి, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** శ్రీరామ, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **తంగలాన్ :** శారద, నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 46, టమాటా 24, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 20, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 28, బీరకాయలు 36, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 22, క్యారెట్ 34, దొండకాయలు 28, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 115, బరబటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 34, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 270, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 84, పొటల్స్ 36, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 66, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	91
ఫారం ధర	--	111
విత్ స్కిన్	--	192
స్కిన్‌లెస్	--	202

ఆలయ భూముల ఆక్రమణపై పంచాయితీ

- అయినాడలో రెండు వర్గాల వాదనలు
- నేడు తహసీల్దార్ కార్యాలయంలో చర్చ





అమ్మవారికి చెందిన భూముల్లో వేసిన షెడ్ (ఇన్‌సెట్లో) అమ్మవారి ఆలయం

పద్మనాభం, సెప్టెంబరు 1 : మండలంలోని అయినాడలో రాజ్యలక్ష్మి అమ్మవారికి చెందిన ఆలయ భూముల్లో కొందరు షెడ్లు వేసి ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారు. సుమారు రూ. 50 కోట్ల నుంచి రూ. 70 కోట్ల విలువ చేసే ఈ భూమి అమ్మకానికి ప్రయత్నాలు సాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2016లో కూడా ఇటువంటి ప్రయత్నాలు జరగ్గా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఆధారాలతో సహా ప్రతిఘటించడంతో ఆ ప్రయత్నాలకు బ్రేక్ పడింది. ఇటీవల ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలవడంతో వారు తమకు సహకరిస్తారన్న ఆశతో సంబంధిత వ్యక్తులు అమ్మవారి పేరున ఉన్న భూముల్లో షెడ్లు వేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ భూములపై వివాదం నెలకొంది. రాజ్యలక్ష్మి అమ్మవారికి నాటి పాలకులు సర్వే నెంబరు 5/2లో 7.34 ఎకరాలు కానుకగా ఇచ్చారు. ఈ భూములను కౌలుకు ఇచ్చి వాటి ద్వారా వచ్చే ఆదాయంతో అమ్మవారి ఉత్సవాలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ భూముల్లో షెడ్లు వేయడంతో వివాదం నెలకొంది. ఈషెడ్లు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని వంశపారంపర్య ఆలయ ట్రస్టు చైర్మన్ మామిడి శివరామకృష్ణ, గ్రామస్థులు తహసీల్దారు ఆనందకుమార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు ఆర్ఐ కోటిని సంఘటనా స్థలానికి పంపించారు. ఆక్రమిత షెడ్ల తొలగించడానికి గత నెల 31న ఆర్ఐ ప్రయత్నించగా సదరు భూములను సాగు చేసుకున్న రైతులు తమ వద్ద కోర్టు తమకు అనుకూలంగా ఇచ్చిన పత్రాలు ఉన్నాయని అవి సోమవారం సమర్పిస్తామని అంతవరకు సమయం ఇవ్వమని అడగడంతో అధికారులు వెనుదిరిగి వచ్చారు. ఈ భూముల విషయమై గ్రామస్థులందరూ ఆదివారం సమావేశమై భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అధికారులు సత్వరమే స్పందించి ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాగా దీనిపై తహసీల్దారు ఆనందకుమార్‌ను వివరణ కోరగా సంబంధిత భూములు వెబ్ ల్యాండ్‌లో పరిశీలించగా అమ్మవారి పేరున ఉన్నాయన్నారు. రైతులు వారి వద్ద ఉన్న పత్రాలు తీసుకువచ్చిన వెంటనే పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న నాయకులు

పవన్ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే వెలగపూడికి ఆహ్వానం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 1 : రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను 15వ వార్డు దుర్గానగర్‌లో సోమవారం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆ వార్డు జనసేన, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును ఆదివారం ఆహ్వానించారు. వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరం, అన్నదానం, కేక్ కటింగ్ చేపట్ట నున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, జనసేన నాయకులు పి. సాయిబాబా, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 1 : ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేయడంతో పాటు కార్మిక హక్కులపై దాడి చేస్తోందని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్ విమర్శించారు.. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం ప్రారంభమైన ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాల్లో మార్పులు చేసి, కార్మిక శక్తిని నాశనం చేస్తోందన్నారు. ఎన్నో పోరాటాలు, 32 మంది ప్రాణత్యాగాల ఫలితంగా ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్‌లకు అప్పగించేందుకు ప్రైవేటీకరణ కుట్రకు తెరతీసిందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎంతటి పోరాటాలకైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సంఘం జాతీయ అధ్యక్షుడు రమేంద్ర మాట్లాడుతూ కార్మిక వర్గం బాగుంటేనే దేశం ప్రగతి పథంలో నడుస్తుందని, ప్రస్తుత పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయన్నారు. కేంద్రం కార్పొరేట్‌లకు రుణ మాఫీ చేస్తుందని, కానీ ప్రభుత్వ రంగాన్ని పట్టించుకోదన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అంతకుముందు నేతలు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్రనాథ్, ఓబులేసు, నేతలు కేఎస్ఎన్.రావు, జె.రామకృష్ణ, కె.రాజుబాబు, అచ్యుతరావు, ఎం.పైడిరాజు, బీవీ.కొండలరావు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి

దేవస్థానం అధికారులకు ఈఓ సూచన



అధికారులతో చర్చిస్తున్న ఈఓ శ్రీనివాసమూర్తి

సింహాచలం, సెప్టెంబరు 1 : ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సింహగిరికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులను ఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశించారు. ఆదివారం ఆయన అధికారులతో కలిసి సింహగిరిపై విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు రాకపోకలు సాగించే ఘాట్ రోడ్డు, మెట్ల మార్గంలో వర్షాల వల్ల రాళ్లు దొర్లిపడడం, నీరు ప్రవహించి ఇబ్బందికరంగా ఉంటే తక్షణమే స్పందించాలన్నారు. రాత్రి, పగలు రెండు బృందాలుగా ఏర్పడి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అలాగే పీఆర్ఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక ఇంజినీరు దండగణ శ్రీనివాసరాజు, స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈఓ ఆనందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జోన్-3లో ప్రత్యేక అధికారి పర్యటన

వెంకోజీపాలెం, సెప్టెంబరు 1 : వీఎంఆర్‌డీఏ కార్యదర్శి, జోన్-3 ప్రత్యేక అధికారి కీర్తి ఆదివారం జోన్‌లోని పలు వార్డుల్లో పర్యటించారు. వర్షాల వల్ల పాడైన రోడ్లు, కాలువలు, గెడ్డలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లపై ఎక్కడైనా చెత్త నిలిచిపోయినా, కల్వర్టులు దెబ్బతిన్నా.. రోడ్లు పాడైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ రమేష్, ఆర్ఐ ఇబ్రహీమ్, జడ్పీ విజయలక్ష్మి, ఏఎంహెచ్‌వో దుర్గాప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, సూరిబాబు, శుభ్రం మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 3న తేదీన జిల్లాలో రెండుచోట్ల జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పెదగంట్యాడలో ఉన్న నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్ వద్ద, జైల్ రోడ్డులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రెండు మేళాలకు పదో తరగతి, ఐటీ, డిప్లమో, డిగ్రీ అర్హత కలిగిన యువత హాజరుకావచ్చనని ఆయన చెప్పారు.

త్వరితగతిన విద్యుత్ పునరుద్ధరణ పనులు : సీఎండీ

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాల వల్ల దెబ్బతిన్న విద్యుత్ సరఫరా వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రులకు, సెల్ టవర్లకు, అత్యవసర సర్వీసులు అందించే ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్టు వెల్లడించారు. అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రిని, సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. వర్షాల వల్ల ఐదు సర్కిళ్ల పరిధిలోని తొమ్మిది మండలాలు, 60 గ్రామాల్లో 3,299 సర్వీసు కనెక్షన్లకు, 56 వ్యవసాయ సర్వీసు కనెక్షన్లకు విద్యుత్ అంతరాయం ఏర్పడగా యుద్ధప్రాతిపదికన సరిచేసినట్టు చెప్పారు. వినియోగదారుల నుంచి టోల్ ఫ్రీ నెంబర్ 1912కు, కంట్రోల్ రూమ్ నెంబర్లకు వచ్చిన 2,583 ఫిర్యాదులను కాల్ సెంటర్ సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేసుకుని, క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియజేశారన్నారు. ఒక్క రోజులోనే 2175 ఫిర్యాదులను పరిష్కరించినట్టు తెలిపారు. వర్షాల ప్రభావంతో తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన స్తంభాలు, పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.విద్యుత్ అంతరాయాలకు టోల్‌ఫ్రీ నెంబర్ 1912తో పాటు కంట్రోల్ రూమ్ నెంబర్లు కార్పొరేట్ ఆఫీసు 9440816373, శ్రీకాకుళం 94906 12633, పలాస 7382585630, టెక్కలి 7095875259, విజయనగరం 9490610102, విశాఖపట్నం 73822 99975, రాజమండ్రి 73822 99960 లను సంప్రతించాలని చెప్పారు.

రచయిత రమణకు సత్కారం

సింహాచలం, సెప్టెంబరు 1 : జీవీఎంసీ 98వ వార్డు అడివివరం గ్రామానికి చెందిన ప్రముఖ రచయిత ఇందూ రమణ (లోగీశ వెంకటరమణ)కు తెలుగు సినీ రచయితల సంఘం నుంచి గౌరవ సత్కారం లభించింది. తెలుగు సినీ రచయితల సంఘం ఆవిర్భవించి మూడు దశాబ్దాలు పూర్తి కావడంతో ఆదివారం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ కల్చరల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రమణకు ప్రముఖ సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు, దర్శకుడు బి. గోపాల్ జ్ఞాపిక అందజేసి సత్కరించారు.

పెదజాలారిపేటలో రక్తదాన శిబిరం

పెదవాల్తేరు, సెప్టెంబరు 1 : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని ఒలిశెట్టి సత్య మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు, 19వ వార్డు జనసేన అధ్యక్షుడు ఒలిశెట్టి గురునాథ్ ఆధ్వర్యంలో ఆదివారం పెదజాలారిపేట కమ్యూనిటీ హాల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది 226 మంది దాతల నుంచి రక్తం సేకరించారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

మద్దిలపాలెం, సెప్టెంబరు 1 : శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాల్లో ఆదివారం యాదవ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించారు. పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 150 మంది విద్యార్థులకు నగదు, మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, నాయకులు ప్రగడ చిన్నారావు, బొట్టా వెంకటరమణ, ఉరుకూటి రాజారావు, వంశీ పాల్గొన్నారు.

ఘనంగా త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం

కొమ్మాది, సెప్టెంబరు 1 : కొమ్మాది జంక్షన్‌లో మూడుగుళ్లు బంగారమ్మ, ఎర్రమ్మ, దండుమారెమ్మ ఆలయాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు పిళ్లా పాపారావు, వాండ్రాసి అప్పలరాజు, కుడితి రామారావు పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు చేయాలని వినతి



విశాఖపట్నం, సెప్టెంబరు 1 : రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈమేరకు ఆదివారం వారు ఎంవీపీ కాలనీలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందించారు. ఎన్నికల ప్రచారంలో సీపీఎస్ సమస్యకు పరిష్కారం చూపుతామని, ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పథకం తీసుకొస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని, వీలైనంత త్వరగా ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. సతీష్, జిల్లా అధ్యక్షుడు జి. శ్రీను, సభ్యులు అప్పలరాజు, దేముడు బాబు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు, ఇతర ఎమ్మెల్యేలకు కూడా వారు వినతపత్రాలు అందజేశారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

పద్మనాభం, సెప్టెంబరు 1 : అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్ అన్నారు. ఆదివారం ఆయన రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు వెదుళ్లవలస చిరంజీవిరావు పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడారు. ఉద్యోగులు అంకితభావంతో పని చేసినప్పుడే తగిన గుర్తింపు గౌరవం లభిస్తాయని చెప్పారు. అనంతరం చిరంజీవిరావు దంపతులను ఆర్‌జేడీ, ఎంఎల్‌సీ రఘువర్మ, పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు. హెచ్ఎం సన్యాసిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విజయనగరం డీఈఓ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ రాంబాబు, జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేష్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తం

పద్మనాభం, సెప్టెంబరు 1 : మండలంలో కురుస్తున్న వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్టీల్ ప్లాంట్ భూసేకరణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ డి. సునీత సూచించారు. ఆదివారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోస్తనీ నది పరివాహక ప్రాంతంలోని ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం అనంతుని గిరి ప్రాంతంలో నివాసాలు ఉంటున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే పాండ్రంగిలో గోస్తనీ నది ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. ఆమెతో పాటు ఎంపీడీఓ విజయకుమార్, తహసీల్దార్ ఆనందకుమార్, ఏఓ చలం, ఎంఆర్ఐ కోటి ఉన్నారు.

'పర్యావరణాన్ని పరిరక్షిద్దాం'

సింహాచలం, సెప్టెంబరు 1 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జనసేన పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా 98వ వార్డు పార్టీ అధ్యక్షుడు మజ్జి సూరిబాబు సారధ్యంలో ఆదివారం అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జనసేన 98వ వార్డు ఉపాధ్యక్షుడు దాసరి మురళీ, ముద్దాడ అనిల్‌కుమార్, కిలారి శ్రీను, బంటుబిల్లి ప్రసాద్, రాజేష్, స్కూల్ కమిటీ వైస్ ఛైర్‌పర్సన్ తులసీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

భీమునిపట్నం, సెప్టెంబరు 1 : స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని చిట్టివలస లేబర్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఆదివారం వారు సీహెచ్‌సీ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ భీమిలి నాయకుడు కొండపు ఈశ్వరరావు మాట్లాడుతూ మహిళా వర్కర్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం రూ. 26 వేలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పైడి, కానూరి రాంబాబు, అప్పలరాజు, వర్కర్స్ భవాని, లక్ష్మి, వెంకటలక్ష్మి, ఎల్మాజి, పెంటయ్య, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

సింహగిరిపై మేఘ మాలిక



సింహగిరిపై మేఘాలు

సింహాచలం, సెప్టెంబరు 1 : సింహగిరిపై ఆదివారం దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. ఈశాన్య ప్రాంతంలోని కొండలపై నుంచి చూస్తే అటు సింహాచలం గ్రామం, ఇటు అప్పన్న ఆలయాలపై మేఘాలు వరుసతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ప్రకృతి రమణీ దృశ్యాల నడుమ అప్పన్న ఆలయాన్ని చూసి పర్యాటకులు మురిసిపోయారు.

పంట పొలాలు పరిశీలన

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 1 : మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురైన పంట పొలాలను ఏవో చలం ఆదివారం పరిశీలించారు. ఈమేరకు ఆయన కృష్ణాపురం, ఇసకలపాలెం, మద్ది గ్రామాల్లో పర్యటించారు. వర్షాల వల్ల ఇప్పటివరకు పంటలకు ఎటువంటి నష్టం జరగలేదని చెప్పారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 1 : ఆధ్యాత్మిక భావంతో మానసిక ప్రశాంతత పొందవచ్చని ఎంపీపీ కె. రాంబాబు అన్నారు. ఆదివారం వెంకటాపురం గ్రామంలో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె. రమణ, ఎంపీటీసీ సభ్యుడు సూరప్పడు, అవాల గంగరాజు, బుగత సత్యనారాయణ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నితాయి గౌరంగ్ మందిర్‌లో పూజలు

ఎండాడ, సెప్టెంబరు 1 : స్థానిక నితాయి గౌరంగ్ మందిర్‌లో వేదాంతస్వామి ప్రభుపాదుల వారి సంస్మరణ దినోత్సవం ఆదివానం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు 1200 రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించిన భక్తిదాస శ్రీభక్తి వేదాంతస్వామి ప్రభుపద జీవిత విశేషాలను భక్తులకు వివరించారు.